# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


# రూ.1.17 లక్షల కోట్లకు ఓకే

*- వివిధ సంస్థల పెట్టుబడులకు మంత్రిమండలి గ్రీన్‌సిగ్నల్*



- ఎస్‌ఐపీబీ నిర్ణయాలకూ కేబినెట్ ఆమోదం
- పర్యాటకాభివృద్ధికి భారీగా పెట్టుబడుల ఆకర్షణ
- రూ.87 వేల కోట్లతో విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటు
- గూగుల్ డేటా సెంటర్‌కు 480 ఎకరాల కేటాయింపు
- ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద బీడీఎల్ ఏర్పాటు
- రూ.1,200 కోట్లతో నెలకొల్పే ఫ్యాక్టరీకి గ్రీన్‌సిగ్నల్
- గ్రామ పంచాయతీల పునఃవర్గీకరణకు నిర్ణయం
- స్వతంత్ర యూనిట్లుగా 13,351 పంచాయతీలు
- ఆదాయాన్నిబట్టి పంచాయతీలను 4 గ్రేడ్లుగా విభజన
- పంచాయతీ సెక్రెటరీలను.. డీవోలుగా మార్చేందుకు ఓకే
- అమరావతిలో రూ.212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణం
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి కొలుసు

2



యువ ఛాంపియన్లను కలవడం
## ఆనందంగా ఉంది
- సీఎం చంద్రబాబు

6



## వుడ్ కట్లరీని ప్రోత్సహించండి
*- నెల్లూరు కలెక్టర్ హిమాన్షుకు సీఎం చంద్రబాబు సూచన*

4

13, 14 తేదీల్లో
## ఢిల్లీకి సీఎం చంద్రబాబు
- మంత్రి లోకేశ్‌తో కలిసి పర్యటన
- డేటా సెంటర్ ఏర్పాటుపై 14న రైడెన్‌తో ఒప్పందం

4

# మంత్రులే.. డ్రైవింగ్ ఫోర్స్

- అధికారులతో పనులు పూర్తి చేయించే బాధ్యత మీదే
- పనులు చేయించినపుడే సామర్థ్యం తెలుస్తుంది
- కేబినెట్ ఆమోదించిన సంస్థలను సమన్వయం చేసుకోండి
- సాధించిన పెట్టుబడుల ఫలాలు ప్రజలకు చెప్పండి
- మంత్రులకు సీఎం చంద్రబాబు హితబోధ

4



# సర్వతోముఖాభివృద్ధి దిశగా ఏపీ

- పోర్టులు.. ఎయిర్ పోర్టులతో వర్ధిల్లనుంది
- ఇథనాల్ ప్లాంట్లతో పర్యావరణానికి మేలు
- పశు పోషణతో పాడి రైతులకు ఆర్థికాభివృద్ధి
- విశ్వసముద్ర గ్రూప్ ప్రాజెక్టులను ప్రారంభించిన ముఖ్యమంత్రి

3

# సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్



- 16న కర్నూలులో భారీ విజయోత్సవ సభ
- ప్రధాని మోడీ సహా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ హాజరు
- జీఎస్టీ సేవింగ్స్‌పై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు
- ఏర్పాట్లపై ఉన్నతస్థాయి అధికారులతో మంత్రుల బృందం సమీక్ష

5



*మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ వివాహ వేడుకకు హాజరై.. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు నాయుడు.*

# నారా భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డ్-2025

- ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ ప్రకటన
- ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకపాత్రకు ప్రతిష్టాత్మక అవార్డు
- నవంబర్ 4న లండన్‌లో ప్రదానం
- ఎన్టీఆర్ ట్రస్ట్ ఉద్యోగులు, అభిమానుల శుభాకాంక్షలు

4



# రూ.1.17 లక్షల కోట్లకు ఓకే



- వివిధ సంస్థల పెట్టుబడులకు మంత్రిమండలి గ్రీన్‌సిగ్నల్
- ఎస్ఐపీబీ నిర్ణయాలకూ కేబినెట్ ఆమోదం.
- పర్యాటకాభివృద్ధికి భారీగా పెట్టుబడుల ఆకర్షణ
- రూ.87 వేల కోట్లతో విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటు
- గూగుల్ డేటా సెంటర్‌కు 480 ఎకరాల కేటాయింపు
- ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద బీడీఎల్ ఏర్పాటు
- రూ.1,200 కోట్లతో నెలకొల్పే ఫ్యాక్టరీకి గ్రీన్‌సిగ్నల్
- గ్రామ పంచాయతీల పునఃవర్గీకరణకు నిర్ణయం
- స్వతంత్ర యూనిట్లుగా 13,351 పంచాయతీలు.
- ఆదాయాన్నిబట్టి పంచాయతీలను 4 గ్రేడ్లుగా విభజన
- పంచాయతీ సెక్రెటరీలను.. డీవోలుగా మార్చేందుకు ఓకే
- అమరావతిలో రూ.212 కోట్లతో రాజ్‌భవన్ నిర్మాణం
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి కొలుసు




అమరావతి (చైతన్య రథం): మొత్తం రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనివల్ల 78,771 ఉద్యోగాలకు అవకాశం ఏర్పడుతుంది. శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ఇవాళ జరిగిన క్యాబినెట్ మీటింగ్ రాష్ట్ర ఆర్థిక పురోగతి, ఏఐ అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. ఎస్ఐపీబీ మీటింగ్‌లో చర్చించిన నిర్ణయాలకూ క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు స్పష్టం చేశారు. గడిచిన 15 నెలల కాలంలో రాష్ట్రాభివృద్ధి, పజల శ్రేయస్సుకు అనేక పాలసీలు ఇచ్చామని కొలుసు పార్థసారథి వెల్లడించారు. వివిధ పాలసీలకు అనుగుణంగా ప్రోత్సాహకాలు ఇచ్చి రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపినట్టు చెప్పారు. సుమారు 70వేల ఉద్యోగాలు వచ్చేలా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే టాటా పవర్ రెన్యూవబుల్ లిమిటెడ్ ప్లాంటు, చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పలనాడు జిల్లాలో సిమెంట్ ప్లాంట్ మరియు గుడిపల్లి మరియు టేకులోడు (అనంతపురం జిల్లా)లో ఏరోస్పేస్ అండ్ ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమల స్థాపనకు మంత్రిమండలి ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్టులు మొత్తం రూ.5,800 కోట్ల రూపాయల పెట్టుబడి లక్ష్యంకాగా.. 6,646మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయన్నారు. ప్రకాశం జిల్లాలో ప్రొపెల్లెంట్ ప్లాంట్‌కు, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధికి, విశాఖపట్నం జిల్లాలో పారిశ్రామిక మరియు లాజిస్టిక్స్ హబ్‌కు, కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్‌కు, విజయనగరం జిల్లాలో ప్రయివేట్ మెగా పార్క్‌కు భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదించిందన్నారు. 56,353 ఉద్యోగావకాశాల కల్పన లక్ష్యంగా రూ.8,186 కోట్ల రూపాయల పెట్టుబడులకు అవకాశం కల్పిస్తూ కేటాయింపులు జరిగాయన్నారు. ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులలో విశాఖపట్నంలో డేటా సెంటర్, ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించింది. అమరావతిలో ఫోర్ స్టార్ హొటళ్లు, విశాఖపట్నం జిల్లా అరకు వ్యాలీలో లగ్జరీ రిసార్ట్, శ్రీశైలం (నంద్యాల జిల్లా)లో త్రీ స్టార్ హొటల్, కాకినాడ జిల్లాలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం లభించింది. సౌర విద్యుత్ మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అనంతపురం, విజయనగరం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోను, కర్నూలు, ఏలూరు మరియు చిత్తూరు జిల్లాల్లో ఆహార ప్రాసెసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేబినెట్ ఓకే చెప్పింది. జూన్ 2024లో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర మంత్రివర్గం 149 ప్రతిపాదనలను ఆమోదించి.. 7.37 లక్షల కోట్ల పెట్టుబడులకు, 6.97 లక్షలమంది ఉపాధి కల్పనకు అవకాశం కల్పించినట్టు వివరించారు.

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. వాటికి కావలసిన ప్రోత్సాహకాలను అందజేయటం, భూములను తక్కువ ధరలకే కేటాయించడం ద్వారా ఈ రంగ అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడుతుందని వివరించారు. ఏడు పర్యాటక ప్రాజెక్టులకు రాష్ట్రమంత్రి మండల ఆమొదించిందని, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ.1,628.8 కోట్ల పెట్టుబడులకు అవకాశం కలిగిందన్నారు. అలాగే, 4,398 మందికి ప్రత్యక్షంగాను, కొన్ని వేలమందికి పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగునున్నాయని మంత్రి కొలుసు వివరించారు.

పర్యాటకరంగానికి సంబంధించి నేడు కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలు కొత్త శకానికి నాంది పలుకుతున్నాయన్నారు. మారియట్, హిల్టన్, దస్పల్ల, ఓబెరాయ్, తాజ్‌వంటి అంతర్జాతీయ బ్రాండ్లు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంవల్ల ఏపీ పర్యాటక రంగానికి ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. అమరావతి, శ్రీశైలం, విశాఖపట్నం, అరకు వ్యాలీ, తిరుపతివంటి ముఖ్యమైన పర్యాటక కేంద్రాలలో హొటళ్లు, రిసార్ట్‌లు అభివృద్ధి చేయడం ద్వారా దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఏపీ టూరిజం పాలసీ 2024-29 ప్రకారం అందించబడుతున్న ప్రోత్సాహకాలు, సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థ మరియు పారిశ్రామిక రేట్లలో యుటిలిటీ సేవలు పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని మంత్రి కొలుసు వివరించారు.

తోటపల్లి బ్యారేజినుంచి 24 ఎంసీఎం నీటిని ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. దీనితోపాటు ఎవాపరేషన్ లాసెస్‌కూ నీటిని కేటాయించినట్టు తెలిపారు. రిలయన్స్ కన్స్యూమర్ ప్రాడెక్ట్‌ల కింద కర్నూలు జిల్లాలో రూ.758 కోట్లతో ఫ్యాక్టరీ నెలకొల్పడానికి ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దీనిద్వారా 500మందికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. టూరిజం పాలసీ ఒక గేమ్ ఛేంజర్. అందుకే దానిపై కేబినెట్ ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పుకొచ్చారు. దాని కోసం ప్రత్యేకమైన ల్యాండ్ పార్సిల్స్ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శ్రీశైలం ఆలయాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులు, సబ్సిడీలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

మంత్రివర్గం నాలుగు ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీలను ఆమోదించింది. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్‌కు కర్నూల్ బ్రహ్మణపల్లిలో 90 ఎకరాల్లో ఫుడ్ పార్క్ స్థాపనకు రూ.758 కోట్ల పెట్టుబడితో 500 ఉద్యోగావకాశాల కల్పనకు ఆమోదం లభించింది. గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్‌కు ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలంలో క్రూడ్ పామ్ కెర్నల్ ఆయిల్ రిఫైనరీ, స్పెషాలిటీ ఫ్యాట్స్ యూనిట్ కోసం 20 ఎకరాల్లో రూ.208 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. సోయా ప్రైవేట్ లిమిటెడ్‌కు చిత్తూరు జిల్లా గుదుపల్లె మండలంలో రిఫైన్డ్ నూనెలు, సోయా ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్ కోసం రూ.201 కోట్ల పెట్టుబడితో 436 మందికి ఉద్యోగాలను కల్పించనున్న యూనిట్ ఏర్పాటుకు ఆమోదం లభించింది. ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కర్నూలు ఓర్వకల్లులో మష్రూమ్ యూనిట్ విస్తరణకు రూ.33 కోట్ల పెట్టుబడితో 200 మందికి ఉద్యోగావకాల కల్పనకై ప్రత్యేక ప్రోత్సాహకాల మంజూరుకు కేబినెట్ ఓకే చెప్పిందని మంత్రి వివరించారు. గ్రామ పంచాయతీల పునర్‌నిర్మాణం, పునఃవర్గీకరణ చేపట్టేందుకు చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదించిందన్నారు. ఈ నిర్ణయం గ్రామ పంచాయతీ పరిపాలనలో 48 ఏళ్ల తరువాత జరుగుతున్న అతిపెద్ద సంస్కరణగా నిలుస్తుందని మంత్రి కొలుసు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 7,244 గ్రామ పంచాయతీ క్లస్టర్లను రద్దుచేసి.. మొత్తం 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లుగా పరిగణించాలన్న ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పింది. పంచాయత్ సెక్రటరీ పోస్టులను స్పెషల్ గ్రేడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా, డిప్యూటీ మండల్ పరిషత్ అభివృద్ధి అధికారి కేడర్‌లో అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుంది. ఐదు ఉన్న గ్రేడ్లను మూడు గ్రేడ్లుగా కలపడం ద్వారా పంచాయత్ సెక్రటరీ పోస్టుల హేతుబద్ధీకరణ జరుగుతుంది. పంచాయత్ సెక్రటరీ పదనామాన్ని పంచాయత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పునఃనామకరణం చేయడానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు ప్రకర్ జైన్ పాల్గొన్నారు.

# సర్వతోముఖాభివృద్ధి దిశగా ఏపీ

- పోర్టులు... ఎయిర్ పోర్టులతో వర్ధిల్లనుంది
- ఇథనాల్ ప్లాంట్లతో పర్యావరణానికి మేలు
- పశు పోషణతో పాడి రైతులకు ఆర్థికాభివృద్ధి
- విశ్వసముద్ర గ్రూప్ ప్రాజెక్టులను ప్రారంభించిన ముఖ్యమంత్రి






నెల్లూరు (చైతన్య రథం): పోర్టులు, ఎయిర్‌పోర్టులతో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని ఈదగాలిలో విశ్వసముద్ర గ్రూపునకు చెందిన వివిధ ప్రాజెక్టులను శుక్రవారం ప్రారంభించారు. ఇథనాల్ ప్లాంట్, నంద గోకులం లైఫ్ స్కూల్, సేవ్ ద బుల్, పవర్ ఆఫ్ బుల్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించి.. పరిశీలించారు. నంద గోకులం లైఫ్ స్కూల్ విద్యార్థులతో చంద్రబాబు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. "నెల్లూరు జిల్లాలో ఇప్పుడు పెద్దఎత్తున మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులతోపాటు.. కీలక పరిశ్రమలు వచ్చాయి. కృష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులు జిల్లా అభివృద్ధికి కీలకంగా మారతాయి. దగదర్తి విమానాశ్రయం త్వరలోనే వస్తుంది. బీపీసీఎల్ గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ, క్రిబ్ కో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ కూడా రాబోతున్నాయి. రాష్ట్ర ప్రగతిలో.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో నెల్లూరు జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. ఇదే సమయంలో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం లేదు. సోమశిల, కండలేరులాంటి మంచి ప్రాజెక్టులు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. 150 టీఎంసీ నీళ్లు ఈ రెండు ప్రాజెక్టుల్లో ఉంటాయి. భవిష్యత్తులో నీటి కొరత లేకుండా ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉంచుతాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి... పర్యావరణం బాగుండాలి

"ఏ ప్రాజెక్టులు చేపట్టినా... రాష్ట్రానికి ఆర్థికంగా ఉపయోగపడడంతోపాటు, పర్యావరణహితంగా ఉండాలి. ఈ దిశగానే విశ్వసముద్ర మూడు ప్రాజెక్టులు చేపట్టింది. 24 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఎథనాల్ ప్లాంట్ రోజుకు 200 కిలోలీటర్ల ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది. దీనికోసం 15 వేల టన్నులకుపైగా పాడైన బియ్యం, నూకలు, పంట వ్యర్థాల కొనుగోలు చేస్తోంది. దీనివల్ల రైతులకు మేలు జరుగుతోంది. రైతుల సంక్షేమంతోపాటు ఇథనాల్ తయారు చేస్తూ విశ్వసముద్ర యాజమాన్యం దేశ ప్రగతికి తోడ్పడుతోంది. అలాగే పశు సంపదను కాపాడేందుకు కొత్త ప్రయోగం చేయటం అభినందనీయం. వివిధ ప్రాంతాలనుంచి తెచ్చిన గోవులను సంరక్షిస్తున్నారు. ఒంగోలు జాతి పశువులను సంరంక్షిచడంపై ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేయడమే కాకుండా.. శాస్త్రీయ పద్ధతుల్లో పునరుత్పత్తికి చింతా శశిధర్ ఫౌండేషన్ పని చేస్తోంది. పవర్ ఆఫ్ బుల్ అనే విధానంలో విద్యుదుత్పత్తి చేపట్టడం వినూత్న ప్రక్రియ. ఈ విధానం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 5 కిలోవాట్లను ఇన్ హౌస్ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఇక నంద గోకులం లైఫ్ స్కూల్ ద్వారా ప్రతిభ కలిగిన, ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉత్తమ విద్య అందిస్తున్నారు. సమాజానికి తిరిగి ఇవ్వటం అనే విధానంలో భాగమే పీ-4. డబ్బులు ఇవ్వటం ఒక్కటే కాదు, చేయూత ఇవ్వడమనేది పీ-4 విధానంలో ముఖ్యమైన అంశం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

## భవిష్యత్తులో భారీ పెట్టుబడులు

"విశాఖకు ఇప్పటికే భారీఎత్తున పెట్టుబడులు వచ్చాయి. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నాం. రూ.88 వేల కోట్లతో ఓ దేశచరిత్రలోనే అతిపెద్ద పెట్టుబడిగా విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ఆల్గారిథమ్స్ కూడా రాసేలా మన పిల్లలు సిద్ధమవుతున్నారు. 2047కి భారత్ నెంబర్ 1 ఆర్థిక వ్యవస్థగా తయారవుతుంది. ఏపీ దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఉంటుంది" అని సీఎం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదా మస్తాన్ రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు హాజరయ్యారు.









# వుడ్ కట్లరీని ప్రోత్సహించండి

**జిల్లా కలెక్టర్ హిమాన్షుకు సీఎం చంద్రబాబు సూచన**



నెల్లూరు, వెంకటాచలం (చైతన్య రథం): "చాలా బాగుంది... ఉదయగిరి వుడ్ కట్లరీని ప్రోత్సహించండి. జిల్లాకు మంచి గుర్తింపు వస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు సూచించారు. శుక్రవారం వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో నందగోకులం లైఫ్‌స్కూల్, నంది పవర్‌బుల్ ప్రాజెక్టు, విశ్వసముద్ర బయో ఎనర్జీ ఈథనాల్ ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా, హెలిప్యాడ్ వద్ద సీఎం నారా చంద్రబాబు నాయుడికి స్వాగతం పలుకుతూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉదయగిరి ఉడ్ కట్లరీని బహూకరించారు. ఆ సందర్భంలో కళా నైపుణ్యానికి మురిసిన సీఎం చాలా బాగుందని కితాబిచ్చారు. సంప్రదాయ చెక్క పనిని ఆధునిక రూపంలో తీర్చిదిద్దుతూ తయారు చేసే కట్లరీలు స్పూన్లు, ఫోర్కులు, కత్తులు, బౌల్స్, వంట సామాన్లు, డెకరేటివ్ వస్తువులు అందం, నాణ్యతలో ప్రత్యేకమైనవిగా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపుపొందాయి. సుమారు 150 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ కళ ఇప్పుడు ఉదయగిరి ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. ప్రతి వస్తువు జాగ్రత్తగా చేతిపనితో, నాణ్యమైన పరికరాలతో రూపొందించబడుతుంది. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయ కళను నేటితరం కళాకారులు ఆధునిక డిమాండ్‌కి అనుగుణంగా పునరుద్ధరిస్తున్నారు. వారిని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలో హస్తకళలను, కళాకారులను ప్రోత్సహించడం వలన కళాకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడి వారి ఆర్థిక పరిస్థితి మారుతుందని, జిల్లాలో స్వయం ఉపాధికి అవకాశాలు మెరుగుపడి ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు సూచించారు.

# మంత్రులే.. డ్రైవింగ్ ఫోర్స్

- **అధికారులతో పనులు పూర్తి చేయించే బాధ్యత మీదే**
- **పనులు చేయించినపుడే సామర్థ్యం తెలుస్తుంది**
- **కేబినెట్ ఆమోదించిన సంస్థలను సమన్వయం చేసుకోండి**
- **సాధించిన పెట్టుబడుల ఫలాలు ప్రజలకు చెప్పండి**
- **మంత్రులకు సీఎం చంద్రబాబు హితబోధ**



అమరావతి (చైతన్య రథం): మంత్రులు డ్రైవింగ్ ఫోర్సుగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు హితబోధ చేశారు. అధికారులు నిబంధనలు, సలహాలు ఇచ్చినప్పటికీ శాఖను నడిపించాల్సింది మంత్రులేనని తేల్చి చెప్పారు. పనిచేయని అధికారులను పిలిచి మాట్లాడో.. మందలించో వారితో పనిచేయించినప్పుడే మంత్రుల సామర్థ్యం బయటపడుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేయాల్సింది మంత్రులేగానీ.. అధికారులు కాదనే విషయం గుర్తెరగాలని హితవుపలికారు. మంత్రివర్గ సమావేశం అజెండా అంశాలు పూర్తయ్యాక తాజా పరిణామాలపై చంద్రబాబు మంత్రులతో చర్చించారు. 15ఏళ్లు తాను ముఖ్యమంత్రిగా పనిచేసినా.. గత 15నెలల్లో వేగంగా సాధించినన్ని పెట్టుబడులు గతంలో రాలేదని సంతృప్తి వ్యక్తం చేశారు. పెట్టుబడులకు ఆమోదంతోపాటు సంస్థలు గ్రౌండ్ అయ్యేలా మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. కేబినెట్‌లో ఏయే సంస్థలకు ఆమోదం తెలుపుతున్నామో సంబంధిత శాఖ మంత్రి.. పనులు ప్రారంభమయ్యేలా సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎంతో కష్టపడి రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తెస్తున్నప్పుడు రాజకీయంగాను వాటి ఫలాలు ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సీఎం సూచించారు. గూగుల్, టీసీఎస్‌వంటి దిగ్గజ సంస్థల రాకతో విశాఖ ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు తెలిపారు. 2028నాటికి విశాఖలో వేలాది ఐటీ ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. భవిష్యత్తులో ప్రత్యేక నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. పశ్చిమలో ముంబయి ఎలాంటి మహానగరమో.. తూర్పులో విశాఖ అంతటి మహానగరంగా అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే 15ఏళ్లలో విశాఖ మహా నగరాల్లో ఒకటిగా గుర్తింపు పొందుతుందని తెలిపారు. వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా ప్రస్తుతం 4.7లక్షలమంది ఉన్నారని... ఈ సంఖ్యను 10 లక్షలకు పెంచాలని అభిప్రాయపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటంతోపాటు రైల్వే జోన్ సాధనవంటి అంశాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గూగుల్ డేటా సెంటర్ మనకు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.

# ఢిల్లీకి సీఎం చంద్రబాబు

- **మంత్రి లోకేశ్ సహా 13, 14 తేదీల్లో పర్యటన**
- **డేటా సెంటర్ ఏర్పాటుపై 14న రైడెన్‌తో ఒప్పందం**

అమరావతి (చైతన్య రథం): ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఈనెల 13, 14 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. 14న గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌తో డేటా సెంటర్ ఏర్పాటుపై ఒప్పందం కుదుర్చు కోనున్నారు. రూ.84 వేల కోట్లతో విశాఖలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు.

కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్, చంద్రబాబు, లోకేశ్ సమక్షంలో ఒప్పందం జరగనుంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీని సీఎం చంద్రబాబు కలిసే అవకాశముంది. 13న ఉదయం రాజధాని అమరావతిలో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం లోకేశ్‌తో కలిసి ఢిల్లీ బయలుదేరి వెళ్తారు.



*మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ వివాహ వేడుకకు హాజరై.. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు నాయుడు.*

# నారా భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డ్-2025



- **ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ ప్రకటన**
- **ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకపాత్రకు ప్రతిష్టాత్మక అవార్డు**
- **నవంబర్ 4న లండన్‌లో ప్రదానం**
- **ఎన్టీఆర్ ట్రస్ట్ ఉద్యోగులు, అభిమానుల శుభాకాంక్షలు**

అమరావతి (చైతన్యరథం): ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని అత్యంత ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (IOD) ఆమెను విశిష్ట వ్యక్తిగా పేర్కొంటూ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు -2025కు ఎంపిక చేసింది. ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకంగా పని చేసినందుకు గానూ ఈ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డును ఆమెకు అందించనున్నారు. లండన్ లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో నవంబరు 4 తేదీన జరిగే కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నుంచి భువనేశ్వరి ఈ అవార్డును అందుకోనున్నారు. సామాజిక సాధికారతకు పాటుపడుతున్న వ్యక్తిగా ఆమెను ఈ ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. గతంలో ఈ ప్రతిష్టాత్మక అవార్డు దక్కించుకున్న వారిలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కో చైర్మన్ గోపీచంద్, ఆదిత్య బిర్లా సెంటర్ ఫర్ కమ్యూనిటీ ఇనీషియేటివ్స్ చైర్ పర్సన్ రాజశ్రీ బిర్లా, సన్ ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ, దుబాయ్ ఎలక్ట్రిసిటీ-వాటర్ అథారిటీ ఎండీ సయీద్ మహ్మద్, హీరో ఎంటర్ ప్రైజెస్, గోయెంకా గ్రూప్ సంస్థల చైర్మన్ సంజీవ్ గోయెంకా వంటి దిగ్గజ వ్యక్తులు ఉన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి అవార్డు రావటంపై ఎన్టీఆర్ ట్రస్ట్ ఉద్యోగులు, అభిమానులు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో శుక్రవారం ఆమెను సన్మానించి, శుభాకాంక్షలు తెలియచేశారు.



# సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్

- 16న కర్నూలులో భారీ విజయోత్సవ సభ
- ప్రధాని మోదీ సహా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ హాజరు
- జీఎస్టీ సేవింగ్స్‌పై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు
- ఏర్పాట్లపై ఉన్నతస్థాయి అధికారులతో మంత్రుల బృందం సమీక్ష



అమరావతి (చైతన్య రథం): సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ పేరిట ఈనెల 16న కర్నూలులో భారీ విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే సభను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి లోకేశ్ కోరారు. ప్రధాని రాష్ట్ర పర్యటన ఏర్పాట్లపై ఉండవల్లి నివాసంలో నిర్వహించిన మంత్రుల బృందం సమావేశానికి రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఎం కార్యాలయ సీనియర్ అధికారులు కార్తికేయ మిశ్రా, పీయూష్ కుమార్, అహమ్మద్‌బాబు హాజరయ్యారు. 16న ఉదయం ప్రధాని మోదీ హెలీకాప్టర్‌లో సున్నిపెంట చేరుకుంటారు. అక్కడనుంచి రోడ్డుమార్గం ద్వారా శ్రీశైలం వెళ్తారు. అనంతరం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తారు. శ్రీశైలంనుంచి బయలుదేరి కర్నూలు సమీపంలోని నన్నూరు రంగమయూరి గ్రీన్ హిల్స్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ నిర్వహించే విజయోత్సవ సభలో ప్రధాని మోదీతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటి మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగిస్తారు. సభానంతరం ప్రధాని మోదీ సాయంత్రం కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఢిల్లీ వెళ్తారు.

రాష్ట్రవ్యాప్తంగా సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్‌పై పెద్దఎత్తున నిర్వహించిన ప్రచార, అవగాహన కార్యక్రమాల గురించి మంత్రుల బృందం చర్చించింది. ఈ సందర్భంగా అధికారులు స్పందిస్తూ... ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ 98,985 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థలు, ఎంఎస్ఎంఈ, రైతు కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించామన్నారు. నూతన జీఎస్టీ విధానంవల్ల కలిగే లబ్ధిపై రాష్ట్రవ్యాప్తంగా హాస్పటల్స్‌లో 22,500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... నూతన జీఎస్టీ అమలులోకి వచ్చాక రాష్ట్రంలో ఆటోమొబైల్ సేల్స్ గణనీయంగా పెరిగిందని, ఈ పెరుగుదల 33శాతానికి పైగా ఉందన్నారు. లగ్జరీ కార్లకు సైతం సెస్సు తొలగించడంవల్ల ఆ విభాగంలోనూ అమ్మకాలు ఆశాజనకంగా నమోదవుతున్నాయన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 16నుంచి 19 వరకు జిల్లా కేంద్రాల్లో గ్రాండ్ జీఎస్టీ షాపింగ్ ఫెస్టివల్స్ నిర్వహించాలని అధికారులను మంత్రుల బృందం కోరింది.

## టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడికి మంత్రి లోకేష్ పరామర్శ

**- మణిపాల్ ఆసుపత్రికి వెళ్లిన మంత్రి లోకేష్**



అమరావతి (చైతన్యరథం): తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడిని మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్పొరేషన్ ఛైర్మన్ల సమావేశంలో సుబ్బానాయుడు పాల్గొన్నారు. ఆ తరువాత తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి లోకేష్ మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి సుబ్బానాయుడు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం

- విజనరీ నేత చంద్రబాబుకు దక్కిన గౌరవం
- రాష్ట్ర పురోగతికి దిశానిర్దేశం చేసిన రాజనీతిజ్ఞుడు సీఎం చంద్రబాబు
- మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానం పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, ఆయన ఒక విజనరీ స్టేట్స్‌మన్. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ముందుగానే ఊహించి, ఆధునిక సాంకేతికతతో, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి విధానాలతో రాష్ట్రానికి దిశానిర్దేశం చేసిన గొప్ప నాయకుడు.

ఐటి రంగం ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపిన దార్శనికుడు. రైతుకు సాంకేతికతను చేరువ చేసిన సంస్కర్త. యువతకు అవకాశాల ద్వారాలు తెరిచిన మార్గదర్శి చంద్రబాబు అని కొనియాడారు. ఏ రంగంలో చూసినా కనిపించే అభివృద్ధి.. ఆయన దూరదృష్టి, కష్టపడే తీరు, పారదర్శక పాలనకు నిదర్శనం. స్మార్ట్ ఆంధ్రప్రదేశ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్, ఈ-గవర్నెన్స్, వాటర్ మేనేజ్‌మెంట్, ఫార్మ్ టు మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలను అమలుచేసి రాష్ట్రాన్ని ఆధునికత దిశగా నడిపించారు. రాజధాని అమరావతి నిర్మాణం ఆయన దూరదృష్టికి తాజా నిదర్శనం. గ్రామ సచివాలయాల భావన, రైతుల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పథకాలు, ప్రజా కేంద్రిత ఆలోచనలకు ప్రతీకలు అని మంత్రి అభిప్రాయపడ్డారు. చంద్రబాబు నాయకత్వంలో తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాల్లో సానుకూల మార్పుకు బాటలు వేస్తోంది. ఆయనలో ఉన్న సూక్ష్మ దృష్టి, పట్టుదల, పరిపాలన నైపుణ్యం, ప్రజాసేవా తపన ఆయనను అందరికంటే ప్రత్యేకంగా నిలబెట్టాయి. దేశ స్థాయిలోనూ ఆయన చేసిన కృషి అనన్యసామాన్యం. అభివృద్ధి, నూతన ఆలోచనలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్న ఆయనకు ఈ రోజు మరొక మైలురాయి అన్నారు. ఆయన వంటి విజనరీ నాయకుడు మన రాష్ట్రానికి వరం. ఆయన పాలనలోనే ఆంధ్రప్రదేశ్ నిజమైన అర్థంలో సుపరిపాలన, స్మార్ట్ రాష్ట్రం దిశగా పయనిస్తోందని మంత్రి ఉద్ఘాటించారు. ఆయనకు మరెన్నో విజయాలు, సుదీర్ఘ ఆరోగ్యం లభించాలని, రాష్ట్ర ప్రజల సేవలో ఆయన మరింత కాలం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడి వివాహ వేడుకకు బాలకృష్ణతో కలిసి హాజరైన మంత్రి లోకేష్

మంగళగిరి (చైతన్యరథం): కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడి వివాహ వేడుకలో మామయ్య, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జరిగిన వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులు సందీప్, బిందు శ్రీ లేఖలను ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.






చైతన్యరథం

# యువ ఛాంపియన్లను కలవడం ఆనందంగా ఉంది: సీఎం చంద్రబాబు





అమరావతి (చైతన్య రథం): నెల్లూరు లోని నంద గోకులం లైఫ్ స్కూల్‌లో ప్రతిభావంతమైన యువ ఛాంపియన్లను కలవడం ఆనందంగా ఉందంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. నెల్లూరు పర్యటన ముగించుకున్న అనంతరం ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ... "ఈ స్ఫూర్తిదాయకమైన సంస్థను ఈరోజు ప్రారంభించే అదృష్టం నాకు లభించింది. విశ్వ సముద్ర గ్రూప్ మద్దతుతో చింతా శశిధర్ ఫౌండేషన్ చొరవతో ఏర్పాటైన ఎన్‌జిఎల్ఎస్ అనేది నిరుపేద అబ్బాయిల కోసం నడిచే ఉచిత రెసిడెన్షియల్ పాఠశాల. ఇది సమగ్ర జీవిత నైపుణ్యాలు,సందర్భోచిత అభ్యాసం, వృత్తిపరమైన సంసిద్ధతపై దృష్టి కేంద్రీ కరిస్తుంది. మహత్తర ఘట్టానికి నడుంగట్టిన వ్యవస్థాపకులను అభినంది స్తున్నాను. రేపటి నాయకులను రూపొంది స్తున్నందుకు ఉపాధ్యాయులు, సిబ్బందికి నా శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.






## సీఎం చంద్రబాబుకు
# ఘనస్వాగతం

నెల్లూరు/ వెంకటాచలం (చైతన్య రథం): నెల్లూరు జిల్లాలో పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో నందగోకులం లైఫ్‌స్కూల్, నంది పవర్ బుల్ ప్రాజెక్టు, విశ్వసముద్ర బయో ఎనర్జీ ఈథనాల్ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించారు. తొలుత ఈదగాలి గ్రామ సమీపంలోని నందగోకులం హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం 3.14 గంటలకు సీఎం చేరుకున్నారు. సీఎంకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, సర్వేపల్లి, కోవూరు, కందుకూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, దగుమాటి కృష్ణారెడ్డి, పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజితా వేజండ్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు ఘనస్వాగతం పలికారు. అలాగే, ఈదగాలి గ్రామంలో వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల అనంతరం సాయంత్రం 4.53 గంటలకు నందగోకులం హెలీప్యాడ్‌కు చేరుకున్న సీఎం హెలీకాప్టర్‌లో విజయవాడకు వెళ్లారు. సీఎంకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.













# నర్సీపట్నం పర్యటనలో నిస్సిగ్గుగా అబద్ధాలు

- జగన్ వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపాటు
- పార్వతీపురం వైద్య కళాశాల నిర్మాణం జరుగుతున్నట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం
- లేకుంటే ముక్కు నేలకు రుద్ది జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- జగన్ హయాంలో జరిగిన సాలీనా ఖర్చుపై మంత్రి నిలదీత



అమరావతి (చైతన్యరథం): నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబంధించి తన సహజ లక్షణమైన అసత్యాలను వల్లెవేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి విఫలయత్నం చేశారని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సీపట్నం పర్యటన సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆక్షేపణ తెలిపారు.

**భూసేకరణే జరగలేదు...నిర్మాణ పనులెక్కడ?**

పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని చెబుతూ, అందుకు సంబంధించిన ఫోటోలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడవుతుందని మాజీ సీఎం వ్యాఖ్యానించడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ఈ కాలేజీకి సంబంధించి అధికారంలో నుండి వైదొలగే దాకా జగన్‌రెడ్డి కనీసం భూసేకరణ కూడా చేయలేదని...ఈ వాస్తవాన్ని విస్మరించి ఆ కాలేజీ నిర్మాణంలో ఉన్నట్లు బహిరంగంగా అబద్ధాలు చెప్పడం జగన్‌కే సాధ్యమని మంత్రి ఎద్దేవా చేశారు.

**నేను రాజీనామాకు సిద్ధం...నీవు క్షమాపణ చెప్పగలవా?**

పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించి వాస్తవాల్ని వెలుగులోకి తేవడానికి జగన్‌రెడ్డి ఆయనకు ఇష్టమైన వారితో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఆ కమిటీ వాస్తవాల్ని పరిశీలించి భూసేకరణ జరిగి, నిర్మాణ పనులు జరుగుతున్నాయని నిర్ధారిస్తే...తాను వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేకుంటే జగన్‌రెడ్డి తన ముక్కును నేలకు రుద్ది క్షమాపణలు తెలపాలని మంత్రి సూచించారు. ఈ సవాల్‌ను స్వీకరించే నిజాయితీ, ధైర్యముంటే జగన్‌రెడ్డి వెంటనే స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనపై ఆయన స్పందించకుంటే పార్వతీపురం కళాశాల విషయంలో జగన్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించడానికి పూనుకున్నారని భావించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

పిపిపి విధానంలో కొన్ని వైద్య కళాశాలల నిర్మాణంపై మాజీ సిఎం జగన్‌రెడ్డి పూర్తిగా అసత్యాల పునాదులపై ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అనుసరిస్తున్న కుట్ర పూరిత ధోరణికి పార్వతీపురం కాలేజీ నిర్మాణం గురించి ఆయన వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజలందరినీ కొంత కాలం, కొంత మందిని పూర్తికాలం మోసగించవచ్చు కానీ....అందరినీ ఎల్లకాలం యామార్చలేమన్న విషయాన్ని జగన్‌రెడ్డి ఇప్పటికైనా గుర్తించాలని మంత్రి అన్నారు.

**నీవెంత ఖర్చు పెట్టావు....జగన్‌రెడ్డీ**

మొత్తం 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ వ్యయం రూ.8,480 కోట్లలో...తాను అధికారంలోనుంచి వైదొలగేనాటికి రూ.3,000 కోట్లు ఖర్చు చేశానని, కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.1,000 కోట్లు ఖర్చు చేసి మొత్తం నిర్మాణ పనులను పూర్తి చేయలేదా అని జగన్ ప్రశ్నించడంలోని అనౌచిత్యాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎత్తిచూపారు. ఈ విషయంలో కూడా జగన్ అబద్ధాల బాటనే ఎంచుకున్నారని మంత్రి ధ్వజమెత్తారు.

నూతన కాలేజీల నిర్మాణ ప్రతిపాదనలను ప్రకటించిన అనంతరం జగన్ నాలుగేళ్లలో కేవలం రూ.1,550 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి వెల్లడించారు. ఈ వాస్తవాల ప్రకారం జగన్‌రెడ్డి సగటున ప్రతి ఏడాదీ చేసిన ఖర్చు కేవలం రూ.387 కోట్లు మాత్రమేనని మంత్రి వివరించారు. వాస్తవాలు ఈ రీతిన ఉంటే...కూటమి ప్రభుత్వం దీనికి మూడు రెట్లు ఖర్చు చేయాలని ఏ ముఖంతో జగన్‌రెడ్డి అడిగారని మంత్రి నిలదీశారు.

నర్సీపట్నం కాలేజీ నిర్మాణ వ్యయం రూ.500 కోట్లలో జగన్ కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఆ పెద్దమనిషి పార్వతీపురం కాలేజికి సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా...ఉత్తరాంధ్ర ప్రజల పట్ల తన నిర్లక్ష్యం, వివక్షలను తనకుతానే బహిరంగపర్చుకుని, తగుదునమ్మా అంటూ నర్సీపట్నానికి జగన్‌రెడ్డి నీతిబాహ్యమైన పర్యటన చెయ్యడం ప్రజలను విస్మయానికి గురిచేసిందని మంత్రి సత్యకుమార్ అన్నారు.

జన్యుపరమైన లోపాల కారణంగా జగన్‌కు నిజాల్ని మాట్లాడడం, వాస్తవాల్ని గ్రహించడం, ప్రజల వివేక, విచక్షణలను గౌరవించడం గిట్టదని, ఈ వాస్తవాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రజలు 2024 ఎన్నికల్లో తగిన గుణపాఠాన్ని నేర్పారని, అయినా జగన్‌రెడ్డికి కనువిప్పు కలగడంలేదని, దీనికి తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

## మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ నేత పేర్ని దాదాగిరి

- పోలీసులపై రుబాబు, దురుసు ప్రవర్తన
- వీధిరౌడీలా వ్యవహరించారని మంత్రి రవీంద్ర మండిపాటు
- చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిక
- అధికారం పోయినా తీరు మారలేదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సుభాష్ అగ్రహం

మచిలీపట్నం (చైతన్యరథం): వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలోని ఆర్.పేట పోలీస్ స్టేషన్‌లో పేర్ని నాని శుక్రవారం దాదాగిరీ చెలాయించటంపై మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్ అయ్యారు.

ఇటీవల పేర్ని నాని నేతృత్వంలో వైసీపీ శ్రేణులు మెడికల్ కాలేజీ వద్ద నిరసన చేపట్టాయి. అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం చేపట్టడంతో పేర్నితో పాటు 400 మందికి పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చారు. పోలీసుల నోటీసులకు సమాధానం ఇవ్వొద్దని వైసీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న పార్టీ వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. కేసు విచారణలో భాగంగా సుబ్బన్నను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. విషయం తెలుసుకున్న పేర్నినాని.. కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అత్యంత దురుసుగా ప్రవర్తించారు.

పేర్ని వ్యవహరించిన తీరుపై మంత్రి రవీంద్ర మండిపడ్డారు. పోలీసుల నైతిక స్థయిర్యాన్ని దెబ్బతీసేలా పేర్ని నాని అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. కనీస విచక్షణ, వ్యవస్థల పట్ల గౌరవం లేకుండా వీధి రౌడీలా వ్యవహరించడం దుర్మార్గం. పోలీస్ స్టేషన్లో అక్రమంగా చొరబడడమే కాకుండా బెదిరిస్తావా? పోలీసుల ను బెదిరిస్తామంటే ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు చూస్తూ ఊరుకోరు. పేర్ని నానికి అధికారం పోయినా.. అహంభావం పోలేదు. గల్లీ రౌడీలా పోలీసులను బెదిరిస్తామంటే చట్టం చూస్తూ ఊరుకోదని గుర్తుంచుకో. ప్రశాంత రాష్ట్రంలో ఇలాంటి అరాచక వాదులకు స్థానం లేదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోం. పోలీసులను అవమానించిన పేర్ని నానిపై చట్టపరంగా చర్యలు తప్పవని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

**అధికారం పోయినా తీరు మారలేదు: మంత్రి సుభాష్**

అధికారం కోల్పోయిన వైసీపీ నేతల తీరు మారలేదని కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని వ్యవహరించిన తీరును మంత్రి సుభాష్ తీవ్రంగా ఖండించారు. వైసీపీ నాయకులకు వీధి రౌడీలకు తేడా లేకుండా పోయిందన్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీస్ అధికారులపై దౌర్జన్యానికి దిగటం, పోలీస్ స్టేషన్లోకి బలవంతంగా ప్రవేశించి నానా యాగీ చేయడం దారుణం. పోలీస్ అధికారులపై దాడికి ప్రయత్నించిన వారు ఎంతటి వారయినా వదిలేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

## కూటమి పాలనలో కొలువుల జాతర

- టీడీపీ ప్రభుత్వాల హయాంలో 2 లక్షల ఉపాధ్యాయుల నియామకం
- విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలకు మంత్రి లోకేష్ కృషి
- టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం



అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ విద్యారంగాన్ని దేశ భవిష్యత్తుకు పునాదిగా భావిస్తుంది.. అందుకే రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్న కాలంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందని, ఈ ఘనత సాధించిన ఏకైక పార్టీ తమదే అని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం ఉద్ఘాటించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1,96,000 మంది ఉపాధ్యాయులు టీడీపీ హయాంలో ఉద్యోగాలు పొందినవారేనని స్పష్టం చేశారు. విద్యారంగాన్ని మెరుగుపరచడం, ఉపాధ్యాయులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశ్వసిస్తున్నారని తెలిపారు. 2019 ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తానని, మెగా డీఎస్సీ ప్రకటిస్తానని హామీ ఇచ్చినా అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో కనీసం ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదని విమర్శించారు. దీనికి విరుద్ధంగా నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో నిరుద్యోగులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీ మీద పెడతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత చంద్రబాబు నాయుడుని ఒప్పించి ప్రమాణ స్వీకారం అనంతరం తొలి సంతకాన్ని డీఎస్సీ మీద పెట్టించి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. దీనిలో భాగంగా కేవలం 150 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. దేశంలో ఎవరికీ దక్కని ఈ ఘనత సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కే దక్కిందన్నారు. ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ పూర్తయిన తర్వాత నారా లోకేష్ త్వరలో రాబోయే విద్యా సంవత్సరానికి కూడా ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా వచ్చే మార్చిలో మరొక డీఎస్సీ, అంతకు ముందు టెట్ నిర్వహిస్తామని ప్రకటించడం నిరుద్యోగ యువతకు పెద్ద భరోసా అని పేర్కొన్నారు. ప్రతి ఏటా డీఎస్సీ ప్రకటిస్తామన్న లోకేష్ పాదయాత్ర హామీని నిలబెట్టుకుంటున్నారని, ఇది విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

**విద్యలో విప్లవాత్మక సంస్కరణలు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను కించపరిచే విధంగా వారితో మరుగుదొడ్లు కడిగించడం, వైన్ షాపుల దగ్గర కాపలా పెట్టించడం వంటి పనులు చేయించారని ఆరోపించారు. కానీ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి లోకేష్ విద్యారంగ సంస్కరణలు చేపట్టి, ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచారన్నారు. 'తల్లికి వందనం' వంటి పథకాలతో వారికి మనోధైర్యాన్నిచ్చారన్నారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రి అయిన దగ్గర నుంచి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 729 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేశారు. 90 మంది ఎస్టీ యువతను కొత్త ఉపాధ్యాయులుగా నియామించారు. 700 కోయ భారతీ టీచర్ పోస్టుల భర్తీ, జూనియర్ కళాశాలల్లో 700 మంది సిబ్బంది సేవల పునరుద్ధరణ, 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3,619 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవల పునరుద్ధరణ వంటివి చేపట్టారని వివరించారు. గత ప్రభుత్వం అసమర్థత కారణంగా నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం అప్పటికి 3వ స్థానంలో ఉన్న విద్యారంగం 19వ స్థానానికి పడిపోయిందని, కానీ లోకేష్ దానిని తిరిగి భారతదేశంలోనే తొలి స్థానానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. లోకేష్ సంస్కరణల ఫలితంగానే నేడు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో హాజరు శాతం పెరగడమే కాకుండా, ఉత్తీర్ణత శాతం కూడా పెరిగిందన్నారు.

**యువత భవిష్యత్తుపై మంత్రి లోకేష్ దృష్టి**

నారా లోకేష్ కేవలం ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలే కాకుండా, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం పారిశ్రామికాభివృద్ధి పైనా దృష్టి పెట్టారన్నారు. ఇందుకోసం ఆయన దేశ విదేశాల్లో పర్యటించి, పారిశ్రామికవేత్తలను కలిసి, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలు, మౌలిక వసతుల గురించి వివరించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తిరిగి బలం చేకూర్చేందుకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో, ప్రైవేటు రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం లోకేష్ నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. చేతల్లో చూపించే వ్యక్తి నారా లోకేష్ అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, రాష్ట్ర భవిష్యత్తుపై దృష్టి పెడుతున్నందుకు ఆయనకు యువత, విద్యార్థుల తరపున నాదెండ్ల బ్రహ్మం ధన్యవాదాలు తెలియజేశారు.

# రాష్ట్ర ‘ఆయుష్’ రంగంలో సరికొత్త అధ్యాయం

- రూ.210 కోట్లతో 3 అయుష్ కళాశాలల నిర్మాణం
- 6 జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రుల ఏర్పాటు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.166 కోట్లు కేటాయింపు
- కేంద్రానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ధన్యవాదాలు

అమరావతి (చైతన్యరథం): గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారిగా రాష్ట్రంలో ‘అయుష్’ వైద్య సేవల విస్తరణ, మెరుగు కోసం రూ.166 కోట్లు మంజూరు చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.166 కోట్ల వ్యయానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ముఖ్యంగా రూ.210 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా రెండు ఆయుర్వేద, ఒక యూనాని వైద్య కళాశాలలు రానున్నాయి. ఆరు జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు కూడా ఏర్పాటుకాబోతున్నాయి. ఒక్కో ఆసుపత్రి ఏర్పాటుకు రూ.7 కోట్ల వరకు వ్యయం కానుంది. అంతేకాకుండా ఆయుర్వేద ఆరోగ్య మందిరాల అభివృద్ధికి కూడా కేంద్రం నిధులు కేటాయించింది.

## ఇప్పటివరకు రూ.248 కోట్లు మంజూరు

2014-24 మధ్య రాష్ట్రానికి రూ.120.17 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇందులో గత ప్రభుత్వ పాలనలో కేంద్రం నుంచి రూ.38.09 కోట్లు విడుదలయ్యాయి. 2021 నుంచి మూడేళ్లపాటు అసలు వైకాపా ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లలేదు. నేడు కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఆయుష్ శాఖకు నిధులు భారీగా వస్తున్నాయి. 24-25లో రూ.83.23 కోట్లు, 2025-26లో రూ.165.65 కోట్లు కేంద్రం కేటాయించింది. రాష్ట్ర ఆయుష్ శాఖ చరిత్రలో రెండేళ్ల వ్యవధిలో రూ.248.89 కోట్లు మంజూరు కావడం ఇదే తొలిసారి. కేంద్రం భారీస్థాయిలో నిధుల విడుదలకు ఆమోదం తెలుపడంపట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయుష్ వైద్య విద్యారులు నిర్వహించిన ఆత్మీయ సత్కారం కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ధర్మవరం, కాకినాడలో కొత్తగా ఆయుర్వేద వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాయలసీమలోనే యూనాని వైద్య కళాశాలను ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఒక్కో కళాశాల నిర్మాణానికి రూ.70 కోట్ల వరకు ఖర్చు అవుతుందని మంత్రి తెలిపారు.

కేంద్రంతో వార్షిక నిధుల ఖరారు సమయంలో ఆయుష్ కమిషనర్ దినేష్ కుమార్ చూపిన చొరవను మంత్రి సత్యకుమార్ అభినందించారు.



గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో యోగా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## 2 ఆయుర్వేద వైద్య కళాశాలలు, 1 యూనాని కళాశాల ఏర్పాటు

ధర్మవరం, కాకినాడలో ఒక్కొక్క ఆయుర్వేద, రాయలసీమలో ఏర్పాటుకానున్న యూనాని వైద్య కళాశాలకు కలిపి రూ.70 కోట్ల చొప్పున రూ.210 కోట్లు కేంద్రం కేటాయించింది. ఇందులో 2025-26 ఆరిక సంవత్సరానికిగాను రూ.46.10 కోట్లు వ్యయం చేయనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మూడు హెూమియో, ఒక ఆయుర్వేద వైద్య కళాశాల చొప్పున ఉన్నాయి. 2026-27 విద్యా సంవత్సరం నుంచి విశాఖలోని నేచురోపతి కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నాయి. కొత్తగా రానున్న వాటితో కలిపితే రాష్ట్రంలో కళాశాలల సంఖ్య 8కు చేరుకుంటుంది.

విశాఖలోని ప్రభుత్వ నేచురోపతి (ప్రకృతి వైద్యం), యోగా కళాశాల (100 పడకలు) కోసం రూ.23 కోట్లు కేంద్రం కేటాయించింది.

## రూ.52.35 కోట్లతో 6 జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు

శ్రీకాకుళం, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున 50 పడకల సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు రూ.52.35 కోట్లు కేంద్రం మంజూరుచేసింది. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.30.34 కోట్లు విడుదల చేయడానికి కేంద్రం ఆమోదం తెలిపింది.

## 276 ఆయుష్ డిస్పెన్సరీల అభివృద్ధికి రూ.49.76 కోట్లు

శిథిలావస్థలో ఉన్న 90 ఆయుష్ ఆరోగ్య మందిర (డిస్పెన్సరీలు) భవనాల పునర్నిర్మాణానికి రూ.27 కోట్లు, జిల్లా, సీహెచ్సీ, పీహెచ్సీల ఆవరణలో ఉన్న 60 డిస్పెన్సరీల భవనాల అభివృద్ధికి రూ.16 కోట్లను కేంద్రం మంజూరుచేసింది. మరో 126 ఆయుర్వేద మందిరాల రికరింగ్ ఖర్చుల అవసరాలకు రూ.5.75 కోట్లను కేంద్రం కేటాయించింది.

## మంత్రికి సత్కారం

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన ఆయుష్ శాఖను పటిష్ట పరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆయుష్ శాఖకు చెందిన పీజీ విద్యార్థులు, హౌస్ సర్జన్లు తమ స్టైపండ్ మొత్తాన్ని పెంచినందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ దేశానికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయుష్ శాఖను ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. విద్యార్థుల పరిస్థితిని అర్థం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం స్టైపండ్ ను పెంచిందన్నారు.

## మరింత పటిష్టంగా ఆయుష్ వ్యవస్థ

ఆయుష్ వ్యవస్థని మరింత పటిష్టపరిచే విధంగా బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది మొత్తం కలిపి 500 పోస్టుల నియామకాలు చేపట్టబోతున్నామన్నారు. విజయవాడ ఆయుర్వేద కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం ఆయుష్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. గతంలో 2018లో సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూషన్ ఫర్ యోగా అండ్ నేచురోపతికి భూమిని కేటాయించగా, గత ప్రభుత్వం ఆ స్థలాన్ని వేరే కార్యకలాపాలకు ఇచ్చిందని, అది కూడా నెరవేరలేదన్నారు. అంత ప్రతిష్టాత్మకమైన సంస్థను గత ప్రభుత్వం రాష్ట్రానికి రానివ్వకుండా చేసిందన్నారు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి ప్రాంతమైన ప్రత్తిపాడులో ఆ సంస్థకు భూమిని కేటాయించి, రాబోయే 2 సంవత్సర కాలంలో నిర్మాణం పూర్తి చేసి అందుబాటులో తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ఆయుష్ శాఖ డైరెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పీజీ విద్యార్థుల స్టైపండ్ ను పెంచి రికార్డు సృష్టించారన్నారు. గతంతో పోల్చుకుంటే ఆయుష్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. వైద్య విద్యార్థులు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకుని ముందడుగు వేయాలన్నారు.

కార్యక్రమంలో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, ఆయుష్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ పి. సాయి సుధాకర్, డాక్టర్ నోరి రామ శాస్త్రి, ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ కె. నిర్మలా జ్యోతి బాయ్, ఆయుర్వేద కళాశాలకు చెందిన పీజీ, హౌస్ సర్జన్లు పాల్గొన్నారు.

# అమరావతిలో అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీ

- వర్క్‌షాప్‌నకు హాజరైన ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు
- అందరి ఆలోచనలతో అద్భుతంగా నిర్మాణం
- రాష్ట్రంలో గ్రంధాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు
- రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు



అమరావతి (చైతన్యరథం): అమరావతిలో అత్యాధునిక వసతులతో అద్భుతంగా సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని రాష్ట్ర గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉండేలా ఐదు ఎకరాల స్థలంలో ఈ లైబ్రరీ నిర్మాణం ఉంటుందన్నారు. గతంలో హైటెక్ సిటీ నిర్మాణం ద్వారా వేలాది మందికి హైద్రాబాద్‌లో ఉద్యోగాలు పొందారన్నారు. 2025లో నిర్మాణం చేయబోయే ఈ లైబ్రరీ కూడా భవిష్యత్ తరాలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా ఉంటుందన్నారు. ఇతర దేశాల్లో కూడా పలు లైబ్రరీలను సందర్శించి వచ్చానన్నారు. ఆ వివరాలతో పాటు, నిపుణుల అభిప్రాయాలను తీసుకుని అందరికీ నచ్చేలా, మెచ్చేలా గ్రంథాలయాన్ని నిర్మిస్తామన్నారు. దేశంలోనే అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీని అమరావతిలో నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నమూనా ఎలా ఉండాలి, ఏ విధంగా రూపకల్పన చేయాలనే అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. అనేక ప్రాంతాల నుంచి నిపుణులైన ఆర్కిటెక్ట్‌లు వచ్చారన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు, సాఫ్ట్ వేర్ లకు సంబంధించిన అంశాలను నిపుణులు వివరించారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని లైబ్రరీలకు పూర్వ వైభవం తీచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిపుణుల నుంచి, వివిధ యూనివర్శిటీ ప్రొఫెసర్ల నుంచి అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. వచ్చే రెండేళ్ళల్లో ఈ సెంట్రల్ లైబ్రరీ ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ గ్రంధాలయం నిర్మాణం కోసం త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ కాంపిటేషన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రముఖ ఆర్కిటెక్చర్లు కూడా ఈ పోటీలో పాల్గొని వివిధ నిర్మాణ ఆకృతులను కూడా అందించవచ్చునన్నారు. అనంతరం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అద్భుతమైన డిజైన్‌తో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణం రెండేళ్లలో పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మౌలిక వసతులు కల్పన బోర్డు ఛైర్మన్ రాజశేఖర్, గ్రంథాలయ సంస్థ బోర్డు డైరెక్టర్ డైరెక్టర్ రాసాని పద్మజ, రామూర్తి, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కృష్ణ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల

# సమస్యల పరిష్కారానికి చర్యలు

**- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



అమరావతి (చైతన్యరథం): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి భరోసా ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత కొద్ది రోజులుగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు శాంతియుత నిరసనలు చేస్తున్న నేపథ్యంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉద్యోగ సంఘాల నేతలతో చర్చించారు. అనంతరం వెలగపూడి సచివాలయంలో ఉద్యోగ సంఘ నేతలు శుక్రవారం మంత్రి స్వామిని కలసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వారు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి డా. స్వామి మాట్లాడుతూ...... గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్ని అంశాలు పరిశీలించి ఉద్యోగులందరికీ మంచి చేస్తామని మంత్రి డా. స్వామి హామీ ఇచ్చారు.

# ఏపీలో ‘టెక్స్ టైల్స్’కు ఉజ్వల భవిష్యత్తు


**- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో టెక్స్ టైల్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లోని తన కార్యాలయంలో మంత్రి సవితను శుక్రవారం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులు కలిశారు. హిందూపురంలోని ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ పార్క్ లో పెట్టుబడులకు ఆసక్తిచూపుతున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ చక్రవర్తి, సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను తక్షణమే అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకురావడంతో ఆ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పాడిందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున టెక్స్‌టైల్స్ పార్క్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం అమెల్ సి ఆల్ట్ కన్సార్టియం ప్రతినిధులను మంత్రి సవిత ఘనంగా సత్కరించారు.

# మెడికల్ సీట్ల ప్రైవేటీకరణకు ఆద్యుడు జగన్ రెడ్డి

- మేనేజ్‌మెంట్, ఎన్నారై కోటా పెట్టింది ఎవరు
- జగన్ హయాంలో ఇచ్చిన జీవో 108 గురించి మాట్లాడాలి
- పీపీపీ విధానంలో అదనంగా 110 సీట్లు వస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్




అమరావతి (చైతన్యరథం): మెడికల్ సీట్ల ప్రైవేటీకరణకు ఆద్యుడు జగన్ రెడ్డి అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ జగన్ నర్సీపట్నం వెళ్లి అక్కడున్న మొండిగోడలు, ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కల్ని చూసి, ఆహా, ఓహో అని చెప్పి ఆయనకి ఆయనే సర్టిఫికెట్ ఇచ్చుకోవడం చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆయన కట్టిన కాలేజీలను జనం చూసి.. ఆగి ఆహా అనాలని కూడా ఈ మధ్య జగన్ పదేపదే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు. నర్సీపట్నంలో గురువారం కూడా ఆ మొండిగోడల్ని చూపించి నానారకాలుగా మాట్లాడి బురద చల్లే ప్రయత్నం చేశాడు. అంతేకాకుండా ప్రత్యేకంగా జీవోల గురించి మాట్లాడాడు. సాధారణంగా ఎప్పుడూ కూడా ఎవరో రాసిన స్క్రిప్టును జగన్ చదువుతాడు. కానీ ఈసారి జీవోలు పట్టుకొచ్చాడు. జగన్ ఇచ్చిన జీవోలు చూసి మాట్లాడటమే మాకు కూడా కావాలి. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవో నెం: 108(తేదీ 19-7-2023) తీసుకువచ్చారు. ఆ జీవో గురించి కూడా ఇప్పుడు జగన్ మాట్లాడాలి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్ల పంపకాల గురించి ఆ జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. 100 శాతం సీట్లలో 15శాతం నేషనల్ కోటా పోగా, మిగతా 85 శాతంలో సగం (50 శాతం) పేద మెరిట్ విద్యార్థులకు.. మరో సగం ( 50 శాతం) సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో కేటాయిస్తారు. అంటే 42.5 శాతం ఓపెన్ క్యాటగిరీ వాళ్లకు ఇస్తారు. మిగతా సీట్ల (42.5 శాతం)లో 50 శాతంగా తీసుకుంటే 35 శాతం మేనేజ్మెంట్ కోటా, 15శాతం ఎన్నారై కోటా ఉంటుంది. అంటే సీట్లు అమ్ముకోవడమే. ఇది జగన్ తీసుకొచ్చిన జీవోనే. దానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం ఏమైనా చేస్తున్నదా అంటే జగన్ దగ్గర సమాధానం లేదు. వైద్య విద్యను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు పీపీపీ విధానం సరైనదని నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ (ఎన్ఎంసీ) అభిజాత్ సేట్ చెప్పారు. మరి ఆయన్ని కూడా జగన్ తప్పు పట్టగలడా. ఎన్ఎంసీ చెప్పినదాన్ని జగన్ ఖండించగలడా. నర్సీపట్నం వెళ్లి ఏం చూపించావ్? నీ చేతకాని తనాన్నేనా? వదిలేసిన నిర్మాణాలని చూపిస్తూ మీ ప్రభుత్వం దద్దమ్మ ప్రభుత్వం అని నిరూపించుకున్నారు. మీరు విడుదల చేసిన జీవో 108 ప్రకారం కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేయడం తప్పా అని పట్టాభి నిలదీశారు.

**పేదల సంతోషాన్ని సహించలేవా..**

పేదవాడి మొఖంలో చిరునవ్వు చూసి జగన్ ఓర్చుకోలేడు. వాళ్లకిచ్చిన సంక్షేమ పథకాల్లో కోత పెట్టాలి. పేద వాడి కడుపునిండా పట్టెడన్నం తింటే జీర్ణించుకోలేడు. అందుకే గతంలో అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు మూసేశాడు. కానీ కూటమి వచ్చాక ఈరోజు ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి నెలా ఒక పండగ. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి పేదవాడి ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకుంటూ వాళ్లకి మంచి చేస్తున్నారు. కానీ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్క పేదవాడి ఇంటికైనా వెళ్లాడా, అసలు వాళ్ల గడప తొక్కాడా? ఎంతసేపూ పరదాలు పెట్టుకోవడం, బారికేడ్లు కట్టుకోవడం, హెలికాప్టర్లలో తిరుగుతూ గాలిలో చక్కర్లు కొట్టడం లేదా రోడ్ల పైన రెడ్ కార్పెట్లు వేసుకోవడం. ఇదేగా నీ పని. ఒక నియంతలా, విలాసవంతమైన జీవితం గడపడమే కదా నీకు చేతనయింది. అలాంటి నీకు పేదవాడి గురించి మాట్లాడే హక్కు ఎక్కడిది జగన్. ఈరోజు ప్రతి పేదవాడి మొఖంలో నవ్వు చూడటం కోసం చంద్రబాబు పనిచేస్తున్నారు. పీ4 పథకంతో లబ్ధి పొందుతున్న బంగారు కుటుంబాల దగ్గరకు వెళ్లి అడుగు వాళ్లే నీకు బుద్ధి చెబుతారని పట్టాభి ధ్వజమెత్తారు.

**పీపీపీ అంటే తెలియదా..**

వైద్య కళాశాలల గురించి జగన్ చేస్తున్న దుష్ప్రచారం అందరికీ అర్థమయింది. నువ్వే జీవో విడుదల చేస్తావు. అదే జీవోని కొనసాగిస్తుంటే ప్రశ్నిస్తావు. పీపీపీ విధానంలో ఒక్కో కాలేజీలో 11 సీట్లు అదనంగా పేదవాడికి చేరుతుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నావు? పీపీపీ విధానంలో ప్రతి కళాశాలలో 50 శాతం సీట్లు పేదవిద్యార్థులకే కేటాయిస్తారు. 15 వేల రూపాయల ఫీజుతో పేద విద్యార్థులకు అదే కేటగిరీ కింద కచ్చితంగా కేటాయిస్తారు. దాదాపు 110 సీట్లు అదనంగా మన పేద విద్యార్థులకు వస్తాయి అని చూస్తుంటే రాక్షసుడిలా అడ్డు పడుతున్నావు. పీపీపీ అంటే ప్రైవేట్ వాళ్లకు ఇచ్చేయటం కాదు. అంతా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది. కానీ ప్రైవేట్ సహకారం మాత్రమే ఉంటుంది. ఎన్ఎంసీ చైర్మన్ అభిజాత్ సేట్‌ను అడిగితే ఈ విషయం స్పష్టంగా చెబుతారు. అయినా నీకు అది కూడా తెలియదా జగన్. తెలుసినా తెలియనట్లు నటిస్తావు. ఇదే జగన్ అధికారంలో ఉన్నప్పుడు పీపీపీ మోడల్ హబ్బులను ప్రతిపాదించలేదా. మరి నర్సీపట్నంలో దీని గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎందుకంటే జగన్ అజెండానే పేదవాడిని ఏడిపించడం కాబట్టి. అందుకే అవేం మాట్లాడకుండా నోరు పారేసుకుని వచ్చావు. కానీ కూటమి అలా కాదు. ఏది ఏమైనా వాస్తవాలను మేం తెలియజేస్తూనే ఉంటాం. నిజమైన పేదల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం చంద్రబాబుది. అది ప్రజలకు కూడా తెలుసు. మెడికల్ కాలేజీల గురించి వైసీపీ మూకల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరనే విషయాన్ని జగన్ తెలుసుకోవాలని పట్టాభి హితవు పలికారు.

# విద్యార్థుల కోసం.. టాటా ట్రస్టు

- మార్పునకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం
- జగన్ పాలనలో నిర్లక్ష్యం.. నేడు చిగురిస్తున్న కొత్త ఆశలు
- సంక్షేమాన్ని సమతూకం చేయాలన్నదే సర్కారు లక్ష్యం

విద్యార్థుల సంక్షేమం –ఒక సామాజిక బాధ్యత. జగన్ సర్కారు ఆ బాధ్యతను విస్మరించింది. ఆకలి కేకలతో గురుకుల విద్యార్థులు రోడ్లెక్కారు. వసతి గృహాల్లో తిండి లేదని.. తాగడానికి నీళ్లు లేవని.. స్నానాల గదుల్లో మురుగునీరు నిలుస్తోందంటూ ఆందోళనలు చేపట్టిన దృశ్యాలే అందుకు నిదర్శనం. అలాంటి నిర్లక్ష్య పాలన నుంచి జనం మార్పును కోరుకున్నారు. ప్రజా నమ్మకాన్ని నిలబెట్టేందుకు కొత్త ప్రభుత్వం ప్రతి అడుగూ ప్రగతివైపు వేస్తోంది. రాష్ట్రంలోని పేద విద్యార్థుల ముఖాలపై చిరునవ్వు చూడాలంటే కేవలం ప్రభుత్వ నిబద్ధత మాత్రమే కాదు.. దానికి సత్సంకల్పంతో కూడిన సామాజిక భాగస్వామ్యం కావాలి. ఈ ఆవశ్యకతను గుర్తించిన టాటా ట్రస్ట్ ఇప్పుడు ఆ దిశగా అర్థవంతమైన అడుగేసింది. ప్రభుత్వాలు ఏ పని చేసినా.. సమయపరిమితులు, విధానపరమైన అడ్డంకులు, అనుమతుల గజిబిజిలు తప్పవు. కానీ సమాజంలో మార్పు తెచ్చే దిశగా కార్పొరేట్ సంస్థలు ముందుకొస్తే.. ఆ ప్రగతికి వేగం వస్తుంది. ఇదే సత్యాన్ని –రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ తాజా యత్నం నిరూపిస్తోంది. ఇటీవల రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి టాటా ట్రస్టు ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. "మన గురుకులాల్లోని, ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు శుభ్రమైన నీరు, ఆరోగ్యకరమైన వాతావరణం ఎలా కల్పించాలి?" అనేది ఆ సమావేశానికి అజెండా అంశమైంది.

**శుభ్రమైన నీరు -ఆరోగ్యకరమైన వసతి గృహాలు:**

తాగునీటి శుద్ధికోసం ఇన్ లైన్ క్లోరినేషన్ టెక్నాలజీ, అలాగే సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు విషయంలో సహకారం అందించేందుకు టాటా ట్రస్ట్ ప్రతినిధులు ముందుకొచ్చారు. మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగించడమే కాకుండా, ఆవరణ పరిశుభ్రతనూ కాపాడే ప్రణాళికకు పురుడుపోశారు. అదే –ఇప్పుడు విద్యార్థుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా మురుగునీటి నిల్వ వలన వచ్చే డెంగీ, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులకు అడ్డుకట్ట వేయడం ప్రధానోద్దేశం. తొలి దశలో కుప్పం, కొండపి నియోజకవర్గాల గురుకులాల్లో ఈ ప్రాజెక్టును పైలట్‌గా ప్రారంభించనున్నారు. ఈ నమూనా సఫలమైతే, రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలకూ విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది.

**ఆహారంలోనూ నాణ్యతకు మద్దతు:**

విద్యార్థుల ఆరోగ్యం నీటితో మాత్రమే కాదు.. ఆహారంతోనూ ముడిపడి ఉంటుంది. అందుకే ట్రస్ట్ మరో స్ఫూర్తిదాయక నిర్ణయం తీసుకుంది. గురుకులాలు, వసతి గృహాల్లో వంటచేసే సిబ్బందికి నాణ్యమైన, పోషక విలువలున్న భోజనం తయారీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి టాటా ట్రస్ట్ ముందుకొచ్చింది. అది కేవలం వంట తరగతి కాదు.. విద్యార్థుల శారీరకాభివృద్ధి, మానసిక చైతన్యానికి పెట్టుబడి. ప్రభుత్వం తీసుకున్న పోషకాహార పథకాల సరసన ఇది చేరితే, ప్రతి విద్యార్థి తినే భోజనం ఆరోగ్యానికి ఆయువుపట్టు అవుతుంది.

**పచ్చదనంవైపు మరో అడుగు:**

ఈ చర్చల్లో మరో ఆసక్తికర అంశం ప్రస్తావనకు వచ్చింది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్. రసాయన రహిత వ్యవసాయ పద్ధతుల ద్వారా వసతి గృహాల పరిసరాల్లో పండించే కూరగాయలు, పంటలు విద్యార్థులకు అందించడం ఒక కొత్త ఆలోచన. ఈ పద్ధతికి సాంకేతిక సహకారం అందించడానికీ ట్రస్ట్ ముందుకొచ్చింది. ఇది భవిష్యత్ తరాలకు ప్రకృతి పరిరక్షణ విలువలు నేర్పే దిశగా ఒక సానుకూల అడుగు.

**కూటమి ప్రభుత్వ దృష్టి..**

**సామాజిక సమానత్వం వైపు:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాంఘిక సంక్షేమ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నది. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పోషణ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాదు.. ఒక దిశ. ప్రభుత్వ నిబద్ధత, కార్పొరేట్ స్ఫూర్తి కలిసినప్పుడు సామాజిక మార్పు ఎలా సాధ్యమవుతుందో చూపే మార్గం. టాటా ట్రస్టువంటి సంస్థలు ప్రభుత్వ పథకాలతో చేయి కలిపితే, విద్యార్థుల జీవితం ఒకే దెబ్బతో మారిపోతుంది.

**ప్రైవేట్ భాగస్వామ్యం అంటే దోపిడీ కాదు.. దాతృత్వం:**

జగన్ పాలనలో నిర్లక్ష్యం, అవినీతి, నిరుత్సాహం చోటుచేసుకున్న చోట ఇప్పుడు పారదర్శకత, నిబద్ధత, భాగస్వామ్యం అడుగులు వేస్తున్నాయి. ఇప్పటివరకు ప్రజల్లో "పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ)" అంటే ప్రైవేట్‌పరం చేసి దోపిడీ చేసేస్తారనే భావన ఏర్పడేలా వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు సాగించారు. టాటా ట్రస్టువంటి సంస్థలు లాభాపేక్ష లేకుండా ప్రజా సేవలో భాగమవుతున్నాయి. ఈ ఉదాహరణ చూస్తే సత్యనిష్ఠతో పనిచేస్తే పీపీపీ మోడల్ కూడా ప్రజల మేలు కోసం ఉపయోగపడుతుందనే నమ్మకం కుదురుతుంది.

ఇది ఒక చిన్న అడుగు అనిపించినా.. దీని ప్రభావం మహత్తరంగా ఉంటుంది. శుభ్రమైన నీరు, పరిశుభ్రమైన వసతి గృహాలు, నాణ్యమైన ఆహారం, ప్రకృతితో స్నేహం.. ఇవన్నీ కలిస్తేనే సమాన అవకాశాలతో కూడిన సమాజం ఏర్పడుతుంది. టాటా ట్రస్టువంటి సంస్థల అండతో ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమ దిశగా ముందుకు సాగుతుందంటే, అది కేవలం పాలనలో ఒక నిర్ణయం కాదు.. భవిష్యత్తుకు పెట్టిన విత్తనం. "సత్సంకల్పంతో నాటిన విత్తనం మొలకెత్తడం ఖాయం. రేపటి తరాలు ఆరోగ్యంగా, జ్ఞానంగా, న్యాయంగా ఎదగడం ఖాయం"

**- సాయి కల్యాణ్, అనలిస్టు**

# ఆమదాలవలసలో ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఆమదాలవలస (చైతన్యరథం): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలు, గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ప్రతి గ్రామానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షుడు, ఎంపిడిఓ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్లు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులను పరామర్శించిన కురుపాం ఎమ్మెల్యే తోయక



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా కురుపాం గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినిలు పచ్చకామెర్లు బారిన పడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి శుక్రవారం నాడు పరామర్శించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కేజీహెచ్ సీనియర్ వైద్యులు మరియు వైద్యులను అడిగి బాలికల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. విద్యార్థులు త్వరగా కోలుకునే విధంగా ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయ సహకారాలతో పాటు మెరుగైన వైద్యం అందుతుందని బాలికలకు ఎలాంటి ఇబ్బంది లేదని ఎమ్మెల్యే తెలిపారు. శుక్రవారం కేజీహెచ్ నుండి పదిమంది విద్యార్థులను డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ఈ పరామర్శలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, గుమ్మలక్ష్మీపురం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, బీజేపీ ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, ఏఎంసి వైస్ చైర్మన్ గార గౌరీ శంకర్, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, జనసేన కొమరాడ మండల కన్వీనర్ తెంటు శ్రీకర్, గరుగుబిల్లి జనసేన మండల కన్వీనర్ బోను శివ, కూటమి నాయకులు శంకర్, అనంత్, రవి, శేఖర్, శంకరరావు, గోపాలకృష్ణ, హితేష్ కుమార్, సుందర్‌రావు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ : ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం టౌన్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖ ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం మార్గం చూపిస్తామని శంకర్ అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని శంకర్ వివరించారు. ఇళ్లు కావాలని పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# నూతన జీ ఎస్టీతో అనేక లాభాలు : ఎమ్మెల్యే శిరీష దేవి

**●నూతన పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన**



రంపచోడవరం (చైతన్యరథం): కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీ ఎస్టీ విధానం సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి చాలా ఉపయోగకరంగా ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీషదేవి అన్నారు. మారేడుమిల్లి మండలం కేంద్రంలో శుక్రవారం ఆమె నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ సౌజన్యంలో సూపర్ జీ ఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేంద్రం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ విధానంపై కలిగే లాభాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. అలాగే విద్య, వైద్యం, గృహోపకరణాలు మరియు నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఇలా చాలా రంగాల్లో కలిగే లాభాలపై అవగాహన కలిగించారు. అలాగే ప్రతీ షాపు తిరిగి తిరిగి కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. షాపుల యజమానులు వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

**మౌళిక సదుపాయాల కల్పనకి శ్రీకారం**

మౌళికసదుపాయల కల్పనలో కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని శిరీషదేవి అన్నారు. మండలంలోని కుండాడ గ్రామంలో శుక్రవారం నూతనంగా మంజూరు అయిన పంచాయతీ భవనం నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమ అభివృద్ధిని జోడెద్దు బండిలాగా నడిపిస్తున్నారని కొనియాడారు. అలాగే పంచాయతీ భవనం నిర్మాణం ప్రజలు దగ్గరుండి పూర్తి నాణ్యతతో చేయించుకోవాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తనకు తెలియ జేస్తే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ మరియు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా చేపట్టే పంచాయతీ భవనం నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే పలువురు సమస్యలపై ఎమ్మెల్యేకి విన్నవించగా వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబు రమేష్, మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేష కుమార్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె దెబోరా సునీత కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతంలో మానవీయ వెలుగులు

**●సీఎంఆర్ఎఫ్ తరపున 130 మందికి రూ.2 కోట్లకు పైగా ఆర్థిక సాయం**

**●మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవే ఇందుకు కీలకం**



టెక్కలి (చైతన్యరథం): మారుమూల ప్రాంతంలో మానవీయ వెలుగులు ప్రసరిస్తున్నాయి. కష్టం అంటే చాలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కదిలి వస్తున్నారు. ఫలితంగా ఇవాళ ముఖ్యమంత్రి సహాయ నిధి తరపున ఎన్నడూ లేని విధంగా, త్వరితగతిన ఆరోగ్య సంబంధ సమస్యలకు సంబంధించి బాధితులకు గొప్పనైన భరోసా అందుతోంది. తత్ ఫలితంగా 130 మంది లబ్దిదారులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు కాళ్లరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదని కానీ ఇప్పుడు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ తీసుకు నిముఖ్యమంత్రి సహాయ నిధి సకాలంలో అందేలా కృషి చేసి, కొన్ని వందల కుటుంబాల్లో వెలుగులు నింపడం ఓ గొప్ప పరిణామం అని బాధితులు చెబుతున్నారు. ఆనందోత్సాహాలతో చెబుతున్నారు.

**ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతూ.. బాధితుల గుండె ఘోష వింట..**

ముఖ్యంగా టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటిదాకా రెండు కోట్ల రూపాయలకు పైగా ఏడాదిన్నర కాల వ్యవధిలోనే అందించడం, ఇందుకు అనుగుణంగా పరిణామాలు సానుకూలం కావడం బాధిత వర్గాలలో అచ్చెన్న నింపిన స్ఫూర్తి ఓ కారణం. అలానే ఏ సమస్య వచ్చినా నేనున్నానని ఇరవై నాలుగు గంటలూ కార్యాలయ వర్గాలను అందుబాటులో ఉంచి బాధిత వర్గాల గోడు వినేందుకు ప్రాధాన్యం ఇస్తున్న మంత్రి అచ్చెన్న చొరవ చిర స్థాయిలో నిలవనుంది. ఏ నాయకుడికీ లేని విధంగా ఆయన ఆఫీసు వర్గాలు ఎప్పటికప్పుడు అప్రమత్తం అవుతూ బాధిత వర్గాలకు చెందిన సమాచారాన్ని విజయవాడకు చేరవేస్తూ, ఆరోగ్య సంబంధ సమస్యల పరిష్కారంలో ముఖ్యంగా కీలక శస్త్ర చికిత్సల సమయంలో చొరవ చూపి పని చేస్తుండడంతో మంత్రి అచ్చెన్నకు ఈ నియోజకవర్గంలో మరింత మంచి పేరు వస్తున్నది. ఇటీవలే ఆయన తీసుకున్న నిర్ణయాల కారణంగా.. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ఎక్కడా ఆలస్యం కాకుండా త్వరితగతన లబ్దిదారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

**ఇతరుల ప్రమేయానికి తావే లేదు...**

ఒకప్పుడు గత ప్రభుత్వ పాలనలో మాదిరిగా ఇతరుల ప్రమేయం కూడా లేదు. అవసరం అయితే తానే స్వయంగా సంబంధిత కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. పేదలకు పెన్నిధిగా ఆయన నిలుస్తున్నారు. తమ అధినేత చంద్రబాబు మార్గ దర్శకాలు అందుకుని ఎప్పటికప్పుడు మానవీయ దృక్పథంతో పనిచేయడం తనకు ఎంతో ఆనందం ఇస్తోందని వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు చెబుతున్నారు. ఒకప్పటిలా ఆఫీసుల చుట్టూ తిరిగే అవస్థ అన్నది లేకుండా చేయడం కోసం మంత్రి అచ్చెన్న చేసి కృషి అనతి కాలంలోనే సత్ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, సుదూర ప్రాంతాల నుంచి సాయం అంటూ వచ్చే వారికి తన ఆఫీసులో పట్టెడన్నం పెట్టి పంపుతుండడం కూడా విశేషం.

**అడుగడుగునా మానవీయ కోణం బాధితులకు అండగా ఉండేందుకే తొలి ప్రాధాన్యం**

వివిధ పనులపై కార్యాలయంకు వచ్చే వారికి, నాణ్యమయిన భోజనం అందిస్తుండడం శుభ పరిణామం. ఇదే విషయమై మంత్రి అచ్చెన్న స్పందిస్తూ.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న టెక్కలి నియోజకవర్గంలో ఏ ఒక్కరూ వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదన్న ఆశయంతోనే తన వంతు కృషి చేస్తున్నానని, ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఎంతగానో సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్యశాలలో లక్షలు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్న లబ్దిదారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు.

# జీఎస్టీ 2.0 పథకం పేద, మధ్యతరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ : ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం (చైతన్యరథం): నియోజకవర్గం కేంద్రంలో స్థానిక కె.ఎస్.ఎం ప్లాజాలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఎలక్ట్రానిక్స్ మరియు హోం అప్లయన్సెస్ ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నెక్స్ట్ జెన్ జీఎస్టీ 2.0 పథకం ద్వారా ప్రతి వ్యాపారవేత్తలకు సులభమైన పన్ను విధానం అమల్లోకి వచ్చింది. గ్రామీణ వ్యాపారస్తుల నుండి రైతు బజార్లు చిన్న చిన్న వ్యాపారులు కూడా ఈ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ఇబ్బందులు లేకుండా లాభాలు పొందగలుగుతారని అన్నారు. ప్రజాసేవలో పారదర్శకత అభివృద్ధిలో వేగం – ఈ రెండు లక్ష్యాల కోసమే ప్రభుత్వ ఈ సంస్కరణలు తెచ్చిందని తెలిపారు. అలాగే రైతులు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ వ్యాపారాలను మరింత విస్తరించాలని గ్రామీణ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# పుష్కరాల నాటికి గ్రామంలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తాం

**●ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): పుష్కరాల నాటికి గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కారం చేస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం ఉదయం ధవళేశ్వరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కాలేజీ నందు అనేక అవకతవకలు జరిగాయని లక్షలాది రూపాయలను దారి మళ్లించారని, కాలేజీ ఆవరణలో కలిగిన కళ్యాణ మండపాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చారని వీటన్నిటిపై విచారణ జరుగుతుందని, త్వరలో దోషులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. కాలేజీ నందు విద్యార్థులకు అవసరమైన అనేక విషయాలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం లక్ష్మీ జనార్ధన స్వామి కొండపై ఉన్న వాటర్ ట్యాంకులను పరిశీలించారు. గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకాన్ని రద్దు చేయడం వలన, గ్రామంలో మంచినీటి సరఫరా విషయంలో కొన్ని సమస్యలు ఉన్నాయని, నూతన వాటర్ గ్రిడ్లు ఏర్పాటు చేసేందుకు అంచనాలు సిద్ధం చేశామని, పేపర్ మిల్ మరియు కొన్ని సంస్థల సహకారంతో త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెల్ప్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, మండల టీడీపీ అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, తలారి మూర్తి, పుక్కళ్ల రాజు, సావాడ శ్రీనివాసరెడ్డి, ఆళ్ల ఆనందరావు, వర్రె రాజేష్, గుర్రాల వెంకట్రావు, ఒంటెద్దు స్వామి, ఎస్.శివాజీ, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ రేట్ల తగ్గింపుతో సామాన్యులకు ఊరట

**●ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



నరసన్నపేట (చైతన్యరథం): జీఎస్టీ చట్టంలో 2.0 పన్ను సంస్కరణల ద్వారా ఇటీవల అమలులోకి వచ్చిన పన్ను రేట్ల తగ్గింపుల ఫలితంగా అనేక వస్తువుల ధరలు తగ్గాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. నరసన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రదర్శనలో భాగంగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ... దీనివల్ల ప్రజలకు ఆర్థిక భారం తగ్గి, విజయదశమి - దీపావళి పండుగలను మరింత ఆనందంగా చేసుకునే సువర్ణ అవకాశం లభించిందన్నారు. ఈ పన్ను రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర జీఎస్టీ శాఖ, పరిశ్రమల శాఖ మరియు సమాచార సాంకేతిక పరిజ్ఞానం శాఖ సహకారంతో ఒక ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు జీఎస్టీ మార్పులపై స్పష్టమైన అవగాహన, ధరల పారదర్శకత మరియు వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా చేసుకోవాలన్నారు.

# సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

**●15 ఏళ్లు పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు రికార్డు సాధించారు**

అనకాపల్లి (చైతన్యరథం): ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నేటితో 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనకాపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నాగ జగదీష్ మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా 8 సంవత్సరాల 255 రోజులు పనిచేసి, నవ్యాంధ్ర సీఎంగా ఆయన పదవీకాలం నేటికీ 6 సంవత్సరాల 110 రోజులు వెరసి 15 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తి చేసుకున్నారని నాగ జగదీష్ అన్నారు. ఈ 15 నెలల పాలనలో అనేక ఒడిదుడుకులు సంక్షోభాలను ఎదుర్కోవడం సంస్కరణలతో ముందుకు సాగడం చంద్రబాబుకే సాధ్యమని, టీడీపీ సంక్షోభ సమయంలో పార్టీ క్యాడర్‌ను నిలబెట్టుకునేందుకు అనివార్య పరిస్థితుల్లో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్‌తో పార్టీ విభేదించి 1995 సెప్టెంబర్ ఒకటో తేదీన ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలిసారిగా ప్రమాణం స్వీకారం చేశారని అన్నారు. హైదరాబాదును ప్రపంచ చిత్రపటంలో నిలబెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందని, అమరావతిని రూపుదిద్దురానికి ప్రణాళికలతో విజన్ 2047 పేరుతో మరో చరిత్ర సృష్టించబోతున్నారని, ఇటువంటి నాయకుడు నాయకత్వంలో పని చేయడం కార్యకర్తలకు నాయకులకు గర్వకారంగా ఉందన్నారు.

# రహదారుల పునర్నిర్మాణానికి నిధులు విడుదల... సీఎంకు కృతజ్ఞతలు



రౌతులపూడి (చైతన్యరథం): మండలంలోని రహదారుల అభివృద్ధికి నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. రౌతులపూడి-శంఖవరం వరకూ 6.4 కిలోమీటర్ల రహదారి పునర్నిర్మాణానికి రూ.3.5 కోట్లు, బలరాంపురం - ఎ. మల్లవరం ఎస్. అగ్రహారం రహదారి అభివృద్ధికి రూ.3.4 కోట్లు విడుదలయ్యాయని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇటీవల మరోసారి టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎంపికైన తమరల సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు... ఆయన్ను సత్కరించారు.

# చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధి, ఆధునికతకు చిరునామా: చీఫ్ విప్ జీవీ

**●ముఖ్యమంత్రిగా ఆయన 15 ఏళ్ల విజయాలు అనితర సాధ్యం**



వినుకొండ (చైతన్యరథం): ప్రభుత్వాధినేతగా చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధి, ఆధునికత చిరునామా, ఆయన విజయాలు అనితర సాధ్యమని కొనియాడారు వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబుకి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు మీడియాతో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చంద్రబాబు రాజకీయ ప్రస్థానమే ఒక తరగని పాఠం అన్నారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టింది మొదలు 2004 వరకు 2014-2019 మధ్య, 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చి, 15 ఏళ్లకు పైగా పాలన అందించారని.. వీటిల్లో ఏ దశ చూ సినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేడు నవ్యాంధ్రలు గ్లోబల్ హబ్‌గా తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాయన్నారు. నాడు హైటెక్ హైదరాబాద్‌ను నిర్మించి, ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన దార్శనికతతోనే నేడు అమరావతి అభివృద్ధికి దశదిశ చూపుతున్నారని పేర్కొన్నారు. సైబరాబాద్ లాంటి ప్రాజెక్టులు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్- ఐఎస్‌బీ వంటి సంస్థల్ని హైదరాబాద్‌కు తీసుకు రావడం, జీనోమ్ వ్యాలీ, రైతు బజార్లు, డ్వాక్రా సంఘాలు, స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్టీజీఎస్ మొదలు అమరావతి రాజధాని నిర్మాణం, క్వాంటమ్ వ్యాలీ వరకు అన్నీ చంద్రబాబు విజన్‌కు చిరస్థాయిగా నిలిచే నిదర్శనాలు అన్నారు. 2014-19 మధ్య వేసిన అభివృద్ధి పునాదులపైనే నవ్యాంధ్ర పునర్నిర్మాణం కొనసాగుతోందని స్పష్టం చేశారు. అభివృద్ధితో పాటు 750కి పైగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. 2020, 2047 ఇలా విజన్ ఏదైనా ప్రజల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యంగా పెట్టు కున్నారన్న జీవీ రైతులు, విద్యార్థులు, మహిళల విషయంలో దేశవ్యాప్తంగా మార్గదర్శిగా నిలిచినట్లు చెప్పారు. ప్రస్తుతం, 15 నెలల్లోనే 4,71,574 మందికి ఉద్యోగాలు కల్పించి, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు.

# పేదల పట్ల ప్రభుత్వ వైద్యుల తీరు మారాలి : టీడీపీ శ్రేణులు



నరసన్నపేట (చైతన్యరథం): నరసన్నపేట ప్రాంతీయ ఆసుపత్రిలో గర్భిణికి సకాలంలో వైద్యులు వైద్యం అందించకపోవడంతో టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. వైద్యులు గర్భిణి పట్ల దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 మంది వైద్యులు ఉండాల్సిన ఆసుపత్రిలో ఆ సమయంలో కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారన్నారు. గర్భిణికి ఉమ్మనీరు క్షీణించి ప్రమాద పరిస్థితి ఉండగా వైద్యులు నిర్లక్ష్యం వహించారని ఆందోళనకు దిగారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ స్పందించి వైద్యం ప్రారంభించారు. పేదల పట్ల ప్రభుత్వ వైద్యుల తీరు మారాలంటూ టీడీపీ శ్రేణులు హితవు పలికారు. డబ్బులు తీసుకురాకుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయడం లేదంటూ పలువురు ఆరోపించారు.

# అధికారులను బెదిరించిన పేర్నినానిపై చర్యలు తీసుకోవాలి

**● ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఆంధ్ర ప్రదేశ్ గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి**



అమరావతి (చైతన్యరథం): పోలీసులను బెదిరించిన పేర్నినానిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్‌తో కలసి గురుమూర్తి మాట్లాడుతూ... మెడికల్ కాలేజ్ వద్ద జరిగిన నిరసన కేసులో విచారణ జరుగుతుండగా, ఏ8 నిందితుడు మేకల సుబ్బన్నను ప్రశ్నిస్తున్న ఆర్‌పేట సీఐ వద్దకు పేర్ని నాని అనుచరులతో కలిసి దూసుకెళ్లి విచారణ అధికారిని బెదిరించడమే కాకుండా విచారణ ప్రక్రియకు అంతరాయం కలిగించడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రత్యక్ష దాడి అని ఆయన పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లడం తప్పు కాదు కానీ విచారణ జరుగుతున్న వ్యక్తిని విడిపించమని ఒత్తిడి తేవడం చట్ట విరుద్ధం. ఒక మాజీ మంత్రి చట్టాన్ని ఇలా అవమానించడం దారుణం. చట్టం అందరికీ సమానం, పేర్ని నానికీ మినహాయింపు లేదు," అని గురుమూర్తి బత్తిన దాస్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు పేర్ని నాని చేసిన ఆగడాలు, అరాచకాలు ప్రజలు మరిచిపోలేదని, అధికారులను బెదిరించడం పేర్ని నానికి అలవాటైందని ఆయన ఆరోపించారు." గోడౌన్‌లో ఉన్న బియ్యం రాత్రికి రాత్రి ఎత్తేసిన పేర్ని నాని గురించి రాష్ట్ర ప్రజలకు తెలుసు," అని గురుమూర్తి బతిన్ దాస్ ఘాటుగా వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, అక్రమాల్లో మునిగి తేలిన పేర్ని నాని ఇప్పుడు అధికారానికి దూరంగా ఉండటంతో నిరాశతో ఇలా దూకుడుగా ప్రవర్తిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లోకి చొరబడి విచారణ అధికారిని బెదిరించడం అంటే చట్టాన్ని తునాతునకలు చేయడమే. ఇలాంటి ప్రవర్తనపై వెంటనే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాము అని అన్నారు. చట్టం ముందు ఎవరూ గొప్ప కాదని, పోలీసు వ్యవస్థను అవమానించే ప్రయత్నం చేసిన పేర్ని నానికి శిక్ష తప్పదని గురుమూర్తి హెచ్చరించారు.

# హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ జరుపుతున్నాం

గుంటూరు (చైతన్యరథం): పెదనందిపాడు మండలంలోని అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంత్రి సవిత పరామర్శించారు. విషయం తెలియగానే అధికారులు అప్రమత్తమై విద్యార్థులకు సత్వరమే వైద్యం అందించే ఏర్పాట్లు చేశారన్నారు. 17 మంది కోలుకొని ఇళ్లకు వెళ్లిపోయారని, పెదనందిపాడులో 17 మంది విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారని వివరించారు. జ్వరంతో బాధపడుతున్న 16 మందిని జీజీహెచ్కు తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఘటనపై విచారణ జరుపుతున్నామని.. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. హాస్టల్లో సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. రాత్రి సమయంలో వసతి గృహంలో ఉండాల్సిన వార్డెన్ లేరని.. అయినా సిబ్బంది స్పందించారని పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు.



# ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



పెడన (చైతన్యరథం): గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజలు, పార్టీ నేతల నుండి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ స్వీకరించారు. శు క్రవారం పెడన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజలు, నాయకుల నుండి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం వెంటనే సంబధిత అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష, అలాగే పెడన నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలే మా లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసి, అభివృద్ధి కార్యక్రమాలకు పాతర వేసిందన్నారు. మా ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి ప్రజల నుండి పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైన్లు, స్ట్రీట్ లైట్లు, మంచినీటి సమస్యలు పరిష్కరించమని ప్రజల పెద్ద ఎత్తున అర్జీలు ఇచ్చారు. వాటిన్నిటి పరిశీలించి, అధికారుల సహకారంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

# సూపర్ జీఎస్టీతో సామాన్య ప్రజలకు భారీ లబ్ధి : బోడే ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గం ఉయ్యూరు టౌన్‌లో ఆర్యవైశ్య నందు జీఎస్టీ, స్టేట్ టాక్స్ వారి సహకారంతో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. సూపర్ జీఎస్టీ ద్వారా సామాన్య ప్రజలకు నెలవారీ నిత్యావసర వస్తువులతో పాటు గృహోపకరణాలు, టీవీ, వాషింగ్ మెషీన్లు, లాంటి వస్తువులపై జీఎస్టీ 28 శాతం నుండి 10శాతం పైగా తగ్గించి ప్రజలకు అందుబాటు ధరల్లోకి రావడం ద్వారా ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రణాళికలో భాగంగా సూపర్ జీఎస్టీ ద్వారా ప్రజలకు కొనుగోలుకు జరిగే మేలు తెలిసేలా మీ వ్యాపార సంస్థలలో గతానికి ప్రస్తుతానికి తేడా స్పష్టంగా తెలిసేలా కరపత్రాలు, రెట్లు వివరాలు ఆయా వస్తువుల దగ్గర స్పష్టంగా కనపడేలా ప్రదర్శన ఏర్పాటు చేయాలని వ్యాపార ప్రతినిధులకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణల లబ్ధి ప్రతి కుటుంబం పొందాలి

**●దేశంలో ఎక్కడా అమలు చేయని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నాం**

**●జీఎస్టీ వల్ల ధరలు తగ్గిన వస్తువుల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్**



విజయవాడ (చైతన్యరథం): జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల తగ్గిన పన్నుల లబ్ధిని రాష్ట్రంలోని ప్రతి కుటుంబం పొందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. అందువల్ల ఈ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆటోనగర్ ఎగ్జిబిషన్ హాలులో ఏర్పాటైన ‘సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్’ పేరుతో జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల తగ్గిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన మరియు అమ్మకాల ఎగ్జిబిషన్‌కు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... సామాన్య ప్రజలకు మేలు జరిగే విధంగా జీఎస్టీలో సంస్కరణలు తీసుకువచ్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల కేంద్రం నంచి రాష్ట్రానికి రావలసిన వాటాలో రూ.8 వేల కోట్లు తగ్గుతుందని చెప్పారు. అయినా సరే రాష్ట్రంలోని ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జీఎస్టీలో సంస్కరణలకు సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. మన ఖజానాకు తగ్గిన రూ.8వేల కోట్లు ప్రజలకు రాయితీగా అందుతున్నాయని, అంటే ఒకొక్క కుటుంబానికి సుమారు నెలకు రూ.15 వేలు చొప్పున 40 లక్షల కుటుంబాలకు అందుతాయని వివరించారు. ప్రజా సంక్షేమానికే కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ఇటీవలే ఆటో కార్మికులకు ఒకొక్కరికి రూ.15వేలు చొప్పున రూ.416 కోట్లు విడుదల చేయడం జరిగిందపి ఎమ్మెల్యే గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. జీఎస్టీలో సంస్కరణల వల్ల ప్రజలకు జరిగే మేలును వివరంగా తెలియజేయడానికి ఇలాంటి సదస్సులను, అవగాహనా కార్యక్రమాలను నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఈ సదస్సులు జరుగుతాయని చెప్పారు. జీఎస్టీలో సంస్కరణ వల్ల తగ్గిన పన్నుల గురించి ప్రజలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ తగ్గింపు అనేది కంపెనీలు ఇస్తున్న డిస్కౌంట్ కాదని ఇది ప్రభుత్వం జీఎస్టీలో పన్నుల తగ్గింపు వల్ల వినియోగదారులకు అందే రాయితీ అని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వివరించారు.

# యార్లగడ్డ నేతృత్వంలో గన్నవరం అభివృద్ధి



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై మాజీ హెూం మంత్రి, అప్కాబ్ మాజీ చైర్మన్ వసంత నాగేశ్వరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయన యార్లగడ్డను కలిసి పలు అంశాలపై చర్చించారు. గన్నవరంలో రహదారుల అభివృద్ధి పారిశ్రామిక అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలు చేయటంలో యార్లగడ్డ చేపట్టిన ప్రత్యేక చొరపై వసంత నాగేశ్వరావు అభినందించారు. యార్లగడ్డ నేతృత్వంలో గన్నవరం దశ, దిశ మారుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ అడ్డుకోవడం తోపాటు అవినీతి రహిత పాలనందిస్తున్న యార్లగడ్డను ప్రత్యేకంగా అభినందించారు. యార్లగడ్డను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం గన్నవరం నియోజకవర్గ ప్రజల అదృష్టంగా వసంత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్ సహకారంతో 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

**●కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేసిన నియోజకవర్గ తెలుగు మహిళలు**



మంగళగిరి (చైతన్యరథం): మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా తాడేపల్లి పట్టణం, తాడేపల్లి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు శుక్రవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 72వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు అందజేశారు. మంత్రి నారా లోకేష్ లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారా లోకేష్‌కు ఎంతో రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలో మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు కుట్టు మిషన్ల ద్వారా తమ కుటుంబ జీవనోపాదులను పెంచుకోవాలన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాలను బ్యాంకు లింకేజీ, రుణాలు, మహిళల పేరిట ఇల్లు, తల్లికి వందనం వంటి వాటిని అమలు చేస్తూ మహిళలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నది కేవలం కూటమి ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నే కుసుమ, తాడేపల్లి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణ వందన, తాడేపల్లి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కరమే కూటమి లక్ష్యం



సత్తెనపల్లి (చైతన్యరథం): ప్రజా సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు... నా దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని, హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనాథలకు అండగా పసిహృదయాలకు నిండుగా

**రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులు, లక్ష్మి కుటుంబ సభ్యులకు పరామర్శ**
**తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు 2 లక్షల ఆర్థిక సహాయం**



కోవూరు, (చైతన్యరథం): సంగం మండలం పెరమన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన ఇందుకూరుపేట మండలం అరుంధతి వాడకు చెందిన చలగల శ్రీనివాసులు కుటుంబానికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అండగా నిలిచారు. గత నెలలో దుర్ఘటన జరిగిన వెంటనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి5 లక్షల రూపాయల పరిహారాన్ని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రకటింప చేశారు. ఇందుకూరుపేటలోని అరుంధతి వాడకు వెళ్లి బాధ్యత కుటుంబాన్ని పరామర్శించారు. ఘోర రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన విశ్వంత్, సింధు ప్రియల పేరిట 2 లక్షల రూపాయలు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట టీడీపీమండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, రావిళ్ళ వీరేంద్ర నాయుడు, సూదల గుంట నాగార్జున నాయుడు, దాసరి విజయ్ కుమార్, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు



# ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘన స్వాగతం

వెంకటాచలం, (చైతన్యరథం): నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్, నందగోపాలం లైఫ్ స్కూల్ ను ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకు ఈదగాలిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద టీడీపీ ఎంపీలు ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి స్వాగతం పలికారు.

# వన్ నేషన్ వన్ టాక్స్ చారిత్రాత్మక నిర్ణయం

**సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి**




దర్శి, (చైతన్యరథం): కేంద్రంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాలు జీఎస్టీ 2.0 సంస్కరణలు అమలు చేసి సామాన్యులకు మేలు చేస్తున్నాయని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వివరించారు. దర్శి పట్టణంలో శుక్రవారం పొదిలి రోడ్డులోని పీజీఎన్ కాంప్లెక్స్‌లో " సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ " పథకంపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ లక్ష్మీతో పాటు మాజీ శాసనసభ్యుడు నారపుశెట్టి పాపారావు, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, సుధాకర్ రెడ్డి, దర్శి మండల ఎంపీడీఓ కల్పన తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలతో ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రాన్ని ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారన్నారు. పేదలకు ఉపయోగపడే అన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించి కొనుగోలు శక్తి పెంచడానికి కృషి చేస్తున్నారన్నారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఎనిమిది వేల కోట్ల రూపాయలు ఆదావుతుందని వివరించారు. ప్రతి కుటుంబానికి దాదాపు సంవత్సరానికి 20,000 రూపాయలు ఆదా అవుతుందని ఆమె తెలిపారు. నిత్యం ఇళ్లల్లో వాడుకునే ప్రతి వస్తువు పై జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గి కొనుగోలు శక్తి పెరిగిందని ఆమె తెలిపారు. తద్వారా ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక పురోగతికి కూడా పరోక్షంగా దోహదపడుతుందన్నారు. తగ్గిన జీఎస్టీ తో వ్యాపారులు కూడా సకాలంలో పన్నులు చెల్లించి ఆర్థిక పరిపుష్టికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో దర్శి మున్సిపల్ శ్రీరామమూర్తి, నియోజకవర్గం లోని మండల పార్టీ అధ్యక్షులు మరెళ్ల వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఏనుగుల దాడి బాధితులకు పరిహారం పంపిణీ

**చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి**

రేణిగుంట, (చైతన్యరథం): ఏనుగు దాడిలో రైతులకు నష్టపరిహారం రేణిగుంట మండలంలోని మామండూరు గ్రామంలో ఏనుగు దాడితో నష్టపోయిన రైతులకు ఉపశమనం కలిగింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా మామండూరు గ్రామంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది.

16 మంది రైతులకు మొత్తం రూ. 2,25,500 విలువైన చెక్కులు అందజేశారు. మామండూరు గ్రామ పరిధిలో ఏనుగులు మామిడి తోటలపై దాడి చేసి తీవ్ర నష్టం కలిగించాయి. ఈ ఘటనలో పంటలు ధ్వంసం కావడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతులకు ఊరట కలిగిస్తూ ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసింది. భవిష్యత్తులో ఏనుగు దాడులు నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రైతులు ఎమ్మెల్యేక సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# అగ్ని ప్రమాద బాధితులకు మంత్రి నారాయణ సొంత నిధులతో సాయం

**బాధితులకు టిడిపి శ్రేణుల చేతుల మీదుగా ఆర్థిక సహాయం**



నెల్లూరు, (చైతన్యరథం): ఇటీవల నెల్లూరు సంతపేట పాత దుస్తుల మార్కెట్ సముదాయంలో అగ్ని ప్రమాదం సంభవించి వ్యాపారస్తులకు నష్టం వాటిల్లిందని మంత్రి నారాయణ దృష్టికి టిడిపి శ్రేణులు తీసుకెళ్లారు. ఈ మేరకు సమాచారం అందుకున్న మంత్రి నారాయణ వెంటనే అధికారులను, టిడిపి శ్రేణులను పంపి పరామర్శించారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో చెప్పిన మాట ప్రకారం సంతపేట పాత దుస్తుల మార్కెట్ అగ్ని ప్రమాద బాధితులకు శుక్రవారం టిడిపి శ్రేణుల చేతుల మీదుగా మంత్రి నారాయణ సొంత నిధులను అందజేయించారు. మార్కెట్లో పూర్తిగా దగ్ధమైన 8 దుకాణాల వారికి 50 వేలు రూపాయలు, పాక్షికంగా దెబ్బతిన్న 12 దుకాణాల వారికి 25 వేల రూపాయలు, 30 దుకాణాల వారికి పదివేల రూపాయలు వంతున మంత్రి నారాయణ సొంత నిధుల నుంచి సహాయం అందించారు. అదేవిధంగా అగ్ని ప్రమాదంతో దుకాణాల రూపు రేఖలు మారిపోయాయి. ఆ దుకాణాలకు మరమత్తులు చేయించి నూతన రంగులు వేయించేందుకు మంత్రి నారాయణ ప్రత్యేక చొరవ చూపారు. అదేవిధంగా భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని బాధితులకు మంత్రి నారాయణ ధైర్యం చెప్పారు. దీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి నారాయణకు జేజేలు పలికారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ వెంటే తాముంటామంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, 51 క్లస్టర్ ఇంఛార్జి శశి..అధ్యక్షుడు ప్రశాంత్,డిప్యూటి కమిషన్తో ,టిడిపి ముఖ్య నేతలు నాయకులు పాల్గొన్నారు.

# ఆకాశమే హద్దుగా ఎదగండి

## అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



రాప్తాడు, (చైతన్యరథం): చెన్నేకొత్తపల్లి మోడల్ స్కూల్లో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం జరిగింది. ఆరోజు తాను భయపడి ఉంటే వంటింటికే పరిమితం కావాల్సి వచ్చేదని రాప్తాడు ఎమ్మెల్యే సునీత పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డిఓ మహేష్, సిఐ శ్రీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ బాలికలకు అంతర్జాతీయ బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మాయిలు చదువుకునే సమయంలోనే ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని పెట్టుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఎవరో ఏదో అనుకుంటారని ఆగిపోవద్దని... అబ్బాయిల కంటే అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదన్నారు. ఒకప్పుడు తాను వంటింటికి మాత్రమే పరిమితమని.. అనుకోకుండా తన భర్త మరణంతో రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. నామినేషన్ వేసేందుకు వెళ్లే సమయంలో ఏడు మంది చనిపోయారన్నారు. ఆ రక్తపు మడుగులోనే తాను వెళ్లి నామినేషన్ వేశానన్నారు. నాకు రాజకీయాలు వద్దు అనుకుంటున్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, తన కుటుంబ సభ్యుల సహకారంతో ముందుకు వెళ్లానని ఎమ్మెల్యే సునీత అన్నారు. అందుకే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నట్లు చెప్పారు. తన కూతురు కూడా డాక్టర్ కావాలని పరిటాల రవి కోరుకున్నారని ఆ విధంగానే ఇప్పుడు గైనకాలజిస్ట్ అయ్యారన్నారు. ఒకప్పుడు తనకు చదువుకునేందుకు అవకాశాలు లేక మధ్యలోనే ఆగిపోయానన్నారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అమ్మాయిలు చదువును ప్రోత్సహిస్తోందన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. చిన్నవయసులో కొందరి మాటలు విని పక్కదారి పట్టే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఇలాంటి వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకొని చదివిస్తుంటారని.. ఆ ఆశల్ని వమ్ము చేయకుండా ఉన్నత శిఖరాలకు వెళ్లాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎక్కువమంది మహిళలు ఉపాధ్యాయులుగా వచ్చారన్నారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. పాఠశాలల్లో కొన్ని అసౌకర్యాలు గమనించామని కచ్చితంగా ఆ సమస్యలు తీరుస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు వచ్చిన తర్వాత ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని ఇందులో మహిళలకు ఎక్కువగా అవకాశాలు ఉంటున్నాయన్నారు.

మీరు కష్టపడి చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం అనంతరం స్థానికంగా ఉన్న కస్తూరిబా బాలికల పాఠశాలలో రూ.2.25 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇంటర్మీడియట్ అదనపు భవనాల నిర్మాణాల పనులను ఎమ్మెల్యే సునీత, ఆర్డీవో పరిశీలించారు. భవనాల నిర్మాణం నాన్యతగా ఉండాలని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

# సూపర్‌గా జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ర్యాలీ

## పాల్గొన్న ఎంపీ బీకే, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



అమరాపురం, (చైతన్యరథం): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ర్యాలీలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. అమరాపురం మండలం కేంద్రంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో వ్యాపారస్తుల దగ్గరకు వెళ్లి వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల వస్తువుల ధరలు గణనీయంగా తగ్గడం నిత్యవసర సరుకులు, మందుల ధరలు తగ్గడం ప్రజలకు చాలా ఉపయోగకరమైనదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్లు, జడ్పిటిసి సభ్యులు సింగల్ విండో అధ్యక్షులు క్లస్టర్ ఇన్చార్జులు అన్ని అనుబంధ కమిటీ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు మేలు

కమలాపురం, (చైతన్యరథం): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో పుత్తా చైతన్య రెడ్డి పాల్గొన్నారు. కమలాపురం నగర పంచాయతీలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుత్తా ప్రజల వద్దకు, షాప్‌లకు వెళ్ళారు. కేంద్రప్రభుత్వం - జీఎస్టీ తగ్గించడం ద్వారా సగటున నెలకు సమాన్య ప్రజలకు, 18,000 వెలరుపాయల భారం తగ్గుతుంది అని వివరించారు. నిత్యం కొనుగోలు చేసే పేస్ట్, బ్రెష్‌లు నిత్తావసర వస్తువులు ఎలా చూసినా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో సామాన్యులకు మేలు జరుగుతుందన్నారు.




# నభూతో నభవిష్యతిగా అంబేద్కర్ స్మృతివనం

## అమరాపురం సభలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు వెల్లడి

మడకశిర, (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గం, అమరాపురం మండలం, అమరాపురం గ్రామంలో రూ.17లక్షలతో నిర్మిస్తున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఎక్కడా జరగనంత ఘనంగా నిర్వహిస్తామని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు రాజు వెల్లడించారు. అమరాపురంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ స్మృతివనం అమరాపురం బస్టాండు ఆవరణలో ఎంపీ నిధులతో రూ.50లక్షలతో నిర్మించబోయే సీసీరోడ్డుకు హిందూపురం పార్లమెంటు సభ్యుడు, బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు శంకుస్థాపన కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో అమరాపురం బస్టాండు అత్యంత అధ్వానంగా ఉందని, ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ ల్యాడ్స్ రూ.50లక్షలతో అమరాపురం బస్టాండు ఆవరణ మొత్తం సీసీరోడ్డు నిర్మించడానికి ఎంపీ బీకే పార్థసారథి తమ వంతు సహాయసహకారాలు అందించారన్నారు. గత ఐదేళ్లలో బస్టాండు ఆవరణలో నడవలేని దుస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక పల్లెల్లో ప్రతి పంచాయతీలోనూ రూ.20లక్షలు నుండి రూ.50లక్షలతో సీసీరోడ్లు నిర్మాణం జరిగిందన్నారు. దాదాపు 200బోర్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటుతో పాటు మండల కేంద్రాల అభివృద్ధిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ రామ్‌ల 25అడుగుల విగ్రహాలతో స్మృతివనాన్ని నిర్మిస్తున్నాం. ఆ మహనీయుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా అమరాపురంలో నిర్వహించబోతున్నాం. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి సూపర్ హిట్ చేస్తున్నామన్నారు.



### అంబేద్కర్ జోలికి వస్తే జగన్ పతనం ఖాయం

చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నేతలు నిప్పు పెట్టి కూటమి ప్రభుత్వంపైకి నెట్టాలని, రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని జగన్మోహన్ రెడ్డి ప్రయత్నం చేశాడన్నారు. పోలీసులు టెక్నాలజీ ఆధారంగా వైసీపీ నేతల దుర్మార్గాలను వెలికితీశారన్నారు. అంబేద్కర్ జోలికి వస్తే నీకు పతనం తప్పదని జగన్మోహన్ రెడ్డిని హెచ్చరిస్తున్నామన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో విదేశాల్లో విద్యను అభ్యసించాలని చంద్రబాబుగా పేరు పెడితే, జగన్మోహన్ రెడ్డి తన పేరు పెట్టుకోవడం దుర్మార్గం అన్నారు. ఈ ప్రాంతంలో వక్కలిగలు ఎక్కువమంది ఉన్నారు. ఈ ప్రాంతానికి వక్క మార్కెట్ యార్డును తెస్తామని మాట ఇచ్చామని త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. మడకశిర నియోజకవర్గానికి డిఫెన్స్ ఫ్యాక్టరీ, సోలార్ ప్రాజెక్టు రాబోతున్నాయి. మడకశిర నియోజకవర్గం నుండి వలసలు అరికట్టబోతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం అన్నారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. నేడు మడకశిరలో జరుగుతున్న అభివృద్ధి పనులను మీరంతా కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు.



# ప్లీజ్ పిల్లల్ని దీపావళి చేసుకోనివ్వండి

## సుప్రీం ధర్మాసనాన్ని కోరిన పలు రాష్ట్రాలు



దిల్లీ ఎన్సీఆర్ పరిధిలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే ఉన్నందున బాణసంచా విక్రయాలను నిషేధిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పునిచ్చింది. ఈ విషయంపై పలు రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీపావళి కోసం పిల్లలు ఎదురుచూస్తారని, పర్యావరణహితమైన బాణసంచాతో వారిని పండగ చేసుకోవడానికి అనుమతించాలని న్యాయస్థానాన్ని కోరాయి. దీపావళి రోజున రాత్రి 8 నుంచి 10 వరకు రెండు గంటల పాటు పర్యావరణహితమైన బాణసంచా కాల్చడానికి అనుమతివ్వాలని ఎన్సీఆర్ రాష్ట్రాల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనాన్ని కోరారు. కొన్ని షరతుల కింద రాష్ట్రాల్లో బాణసంచా వాడకాన్ని అనుమతించవచ్చని, జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ ఆమోదించిన పర్యావరణహిత బాణసంచా మాత్రమే తయారు చేసి, విక్రయించేలా సూచించాలని తుషార్ మెహతా పేర్కొన్నారు.

అత్యధిక పేలుడు స్వభావమున్న టపాసులు తయారు చేయకుండా రాష్ట్రాలు, దిల్లీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటాయని దర్మాసనానికి తెలియజేశారు. అదే విధంగా వ్యాపారులు అనుమతి పొందిన క్రాకర్లను మాత్రమే విక్రయించాలని ఫ్లిప్కార్ట్, అమెజాన్ మొదలైన ఏ ఇతర ఇ-కామర్స్ వెబసైట్లు కూడా బాణసంచాను ఆన్‌లైన్లో విక్రయించవద్దని సూచించారు. ఈ విషయంపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.

# శబరిమల బంగారం లెక్కల్లో అవకవతకలు

## *దర్యాప్తు చేయాలని కేరళ పోలీసులకు కోర్టు ఆదేశం*




అయ్యప్పస్వామి కొలువుదీరిన శబరిమల ఆలయంలోని విగ్రహాల బంగారం తాపడం బంగారం లెక్కల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్లు కనిపిస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంపై క్రిమినల్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేయాలని రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. అలాగే ఈ వివాదంపై ఇప్పటికే న్యాయస్థానం సిట్ ఏర్పాటు చేసి, నెలలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దానిని బహిర్గతం చేయొద్దని పేర్కొంది. శబరిమలలో గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను 2013లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరిచేయించి. కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక, ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిపింది. ఈ పరిణామాలపై ఇప్పటికే హైకోర్టు పలు అనుమానాలు వ్యక్తంచేసింది. ఉన్నట్టుండి తాపడాల బరువు 4.521 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. అలాగే ముందస్తు అనుమతి లేకుండా ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడాలను మరమ్మతుల నిమిత్తం తొలగించడం పైనా అగ్రహం వ్యక్తం చేసింది.

# లక్షల కొద్దీ నోట్ల కట్టలు.. కిలోల కొద్దీ బంగారం

### అధికారి కాదు... అవినీతి అనకొండ!

### తనిఖీల్లో 17 టన్నుల తేనె.... అవాక్కయిన అధికారులు



మధ్యప్రదేశ్‌లో పదవీ విరమణ పొందిన ఓ ప్రభుత్వ ఇంజనీర్ సంపద చూసి అధికారులే ఆవాక్కయ్యారు. లోకాయుక్త అధికారులు ఆయన ఇళ్లల్లో సోదాలకు వెళ్లగా.. నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, వెండి లభించాయి. ఇక ఆయన ఫామ్ హౌస్లో దొరికిన 17 టన్నుల తేనెను చూసి, వారు ఆశ్చర్యపోయారు. భోపాల్లో ప్రజా పనుల విభాగంలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేసి రిటైర్ అయిన జీపీ మెహ్రా లగ్జరీ లైఫ్ స్టైల్ ఇది. ఓ అప్రకటిత ఆస్తుల వ్యవహారంలో తీగ లాగితే... మెహ్రా బండారం బయటపడిందని ఆంగ్ల మీడియా కథనం వెల్లడించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు చేస్తుండగా జీపీ మెహ్రా పేరు వినిపించింది. దీంతో అధికారులు ఆయనపై దృష్టిసారించారు. ఈ క్రమంలోనే భోపాల్, నర్మదాపురంలోని మెహ్రా నివాసాల్లో లోకాయుక్త అధికారులు తనిఖీలు చేపట్టారు. నలుగురు డీఎస్పీ ర్యాంక్ అధికారుల నేతృత్వంలో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. మణిపురంలోని మెహ్రా నివాసంలో అధికారులు 8,79 లక్షల నగదు. రూ.50 లక్షల విలువ చేసే ఆభరణాలు, రూ.56 లక్షల ఫిక్స్ డిపాజిట్లను గుర్తించారు. ఇక, దనా పానీలో మెహ్రాకు ఓ లగ్జరీ అపార్ట్మెంట్ ఉంది. అందులో అధికారులు తనిఖీలు చేయగా.. భారీగా నోట్ల కట్టలు, రూ.3 కోట్ల విలువ చేసే రూ.2.6 కిలోల బంగారం, 5.5 కిలోల వెండిని గుర్తించినట్లు సదరు కథనం పేర్కొంది. నర్మదాపురంలో మెహ్రాకు చెందిన ఫామ్ హౌస్కు వెళ్లగా కళ్లుచెదిరే ఆయన విలాసాలు చూసి అధికారులు కంగుతిన్నారు. ప్రైవేటు సామ్రాజ్యాన్ని తలపించేలా ఆ వ్యవసాయ క్షేత్రంలో 32 అధునాతన కాటేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో ఏడు కాటేజీలను పూర్తిచేశారు. మధ్యలో చెరువు, గోశాల, ఆలయం, నాలుగు లగ్జరీ కార్లు కన్పించాయి. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ఆయన ఫామ్ హౌస్ నుంచి 17 టన్నుల తేనెను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా ఆయన తేనె సాగు చేస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆయన ఆస్తుల లెక్కింపు కొనసాగుతోందని, మెహ్రా సంపద రూ.వందల కోట్లలో ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఆయన బ్యాంకు రికార్డులు, డిజిటల్ ఫైళ్లను ఫోరెన్సిక్ బృందాలు తనిఖీ చేస్తున్నాయి. మెహ్రా బినామీ పెట్టుబడుల పైనా అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# భారత్ సైన్యానికి విద్యుత్ రక్షక్ పేటెంట్ హక్కు

## కేంద్రప్రభుత్వం నిర్ణయం



ఇండియన్ ఆర్మీకి చెందిన సమీకృత జనరేటింగ్ మానిటరింగ్, ప్రొటెక్షన్ అండ్ కంట్రోల్ సిస్టమ్ ‘విద్యుత్ రక్షక్కు పేటెంట్ హక్కు కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇటీవల దీనిని మేజర్ రాజ్ ప్రసాద్ ఆర్ఎస్ అభివృద్ధి చేశారు. సంక్లిష్ట పరిస్థితుల్లో విద్యుత్తు వ్యవస్థలను కాపాడటంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. బహుళ జనరేటర్లు, పవర్ సిస్టమ్‌ల సమగ్ర పర్యవేక్షణ, రక్షణ, నియంత్రణలకు ఇది ఉపయోగపడుతుంది. భారత సైన్యానికి ‘విద్యుత్ రక్షక్ 2023 నుంచి 20 ఏళ్లపాటు ఈ పేటెంట్ హక్కును కల్పించారు. దీనికి సంబంధించిన వివరాలను తెలియజేస్తూ భారత సైన్యం సోషల్ మీడియాలో వీడియోను షేర్ చేసింది. ఆత్మనిర్భర్ భారత్ వైపు దేశం అడుగులు వేస్తున్న సమయంలో మేజర్ రాజ్ ప్రసాద్ రూపొందించిన ‘విద్యుత్ రక్షక్‌తో భారత సైన్యం మరో ముందడుగు వేసిందని ఏడీజీపీఐ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. తక్కువ బరువుతో ఉండే ఈ యంత్రం ఎత్తైన, మారుమూల ప్రాంతాల్లో యాంత్రిక లోపాల పర్యవేక్షణ, నివారణ వంటి వాటి విషయంలో సైన్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

# దగ్గుమందు కంపెనీపై చర్యలకు సిద్ధం

## సుప్రీం ధర్మాసనం గ్రీన్ సిగ్నల్



కోల్డ్రిఫ్ దగ్గుమందు కారణంగా మధ్యప్రదేశ్‌లో పలువురు పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి సీబీఐ విచారణ, ఔషధ భద్రతా విధానాలలో వ్యవస్థాగత సంస్కరణలను కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిల్పై తక్షణమే విచారణ జరపాల్సి ఉందని పిటిషనర్, న్యాయవాది విశాల్ తివారి కోరడంతో విచారణ జరపడానికి గురువారం న్యాయస్థానం అంగీకరించింది. అనంతరం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ పిటిషన్‌పై అభ్యంతరం వ్యక్తంచేశారు. ప్రస్తుతం తాను ఏ రాష్ట్రం తరపున వాదించడం లేదని.. అయితే ఈ విషయంలో తమిళనాడు, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యల తీవ్రతను తగ్గించలేమని మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. ఇటువంటివాటిపై చర్యలు తీసుకునేందుకు రాష్ట్రాల్లో పలు చట్టపరమైన యంత్రాంగాలు ఉన్నాయని.. ఇందుకు సీబీఐ అవసరం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్. కె. వినోద్ చంద్రన్లతో కూడిన ధర్మాసనం న్యాయవాది విశాల్ తివారీ దాఖలు చేసిన పిల్‌ను తోసిపుచ్చింది. కోల్డ్రిఫ్ దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్లో చాలామంది చిన్నారుల ప్రాణాలు కోల్పోయారు. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. చిన్నారుల మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా... సిరప్లో 48.6 శాతం ఇథిలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈక్రమంలో ఆ కంపెనీపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

# సాహసికి.. నోబెల్ శాంతి!

## వెనుజువెలా హక్కుల పోరాట నేతకు పురస్కారం - ప్రకటించిన నోబెల్ పీస్ కమిటీ

ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించింది. ఈ విషయాన్ని నార్వే నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. వెనెజువెలాకు చెందిన మరియా కొరీనా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకుగానూ ఈ పురస్కారం లభించింది. అయితే, ఈ అత్యున్నత పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ ఏడాది మొత్తం 338మంది శాంతి పురస్కారానికి నామినేట్ అవ్వగా.. అకాడమీ సభ్యులు మరియా వైపు మొగ్గుచూపారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకుగాను మచాడోకు ఈ పురస్కారం ఇస్తున్నట్టు నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వంనుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతిమార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో మచాడో ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. గత ఏడాది కాలంగా అజ్ఞాతంలో జీవించాల్సి వచ్చిందని పేర్కొంది. ఆమె వెనెజువెలా పార్లమెంట్ సభ్యురాలిగా, దేశ విపక్ష నేతగా పనిచేశారు. వెనెజువెలా సైనికీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన ఆమె.. శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్యం కోసం కృషిచేసి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని నోబెల్ కమిటీ వెల్లడించింది.

"నా దేశం కుప్పకూలుతుంటే ఇంట్లో కూర్చులేను. ప్రజా జీవితాల్లో మార్పు కోసం బుల్లెట్ల బదులు బ్యాలెట్లు ఎంచుకుందాం".. దాదాపు పాతికేళ్ల క్రితం మరియా మాటలివి. నాటినుంచి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతోంది. నియంతృత్వ శృంఖలాల నుంచి దేశ విముక్తికి ఆమె చేస్తోన్న సాహస పోరాటమే.. ఆమెను ప్రతిష్ఠాత్మక 'నోబెల్ శాంతి బహుమతి'కి దగ్గర చేసింది. మరియా కొరీనా మచాడో 1967 అక్టోబరు 7న జన్మించారు. తల్లి కొరీనా పరిస్కా సైకాలజిస్ట్. తండ్రి



హెన్రిక్ మచాడో జులావోగా స్టీల్ వ్యాపారవేత్త. ఆమె పూర్వీకులు వెనెజువెలా స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారు. మరియా ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ, ఫైనాన్స్‌లో మాస్టర్స్ చేశారు. 1992లో వీధి బాలలు, అనాథ చిన్నారుల కోసం అటెనియా ఫౌండేషన్‌ను స్థాపించారు. అక్కడ పనిచేస్తున్నప్పుడే వెనెజువెలాలో ప్రజాస్వామ్య హక్కుల కోసం గళమెత్తారు. ఆ సమయంలో దేశ ద్రోహం, కుట్ర కేసులను ఎదుర్కొన్నారు.

2002లో సుమేట్ అనే స్వచ్ఛంద సంస్థకు సహ వ్యవస్థాపకురాలిగా పనిచేశారు. ఈ సంస్థ ప్రజల ఓటింగ్ హక్కులను కాపాడటం, పారదర్శక ఎన్నికల నిర్వహణకు పనిచేసింది. పదేళ్లపాటు స్వచ్ఛంద సంస్థతో పనిచేసిన ఆమె.. సొంతంగా 'వెంటే వెనెజువెలా' పేరిట లిబరల్ పొలిటికల్ పార్టీ స్థాపించారు. 2010లో జాతీయ అసెంబ్లీకి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి విజేతగా నిలిచిన అభ్యర్థిగా చరిత్ర సృష్టించారు. 2011లో తొలిసారి జాతీయ అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2014 మార్చిలో వెనెజువెలాలో తీవ్రస్థాయిలో ఆందోళనలు జరుగుతున్న సమయంలో పనామాలో జరిగిన ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ సదస్సులో పాల్గొన్నారు. అక్కడ వెనెజువెలా పరిస్థితి గురించి ప్రసంగించారు. ఇది పాలకులకు ఆగ్రహం తెప్పించింది. అన్ని రాజకీయ పార్టీల నుంచి ఒత్తిడి రావడంతో మరో ఏడాది పదవీకాలం ఉండగానే మరియాను జాతీయ అసెంబ్లీ నుంచి బహిష్కరించారు. అనంతరం ఆమెపై పలు కేసులు నమోదు చేశారు. 2014 నుంచి 2021 వరకు స్థానిక రేడియో స్టేషన్లో ప్రసారకర్తగా పనిచేశారు. రాజకీయ విశ్లేషణలకు సంబంధించిన టాక్‌షోకు హోస్టుగా వ్యవహరించారు. 2023లో మళ్లీ రాజకీయాల్లోకి తిరిగొచ్చారు. ప్రతిపక్ష పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో 90శాతం మెజార్టీ సాధించారు. 2024లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో నికోలస్ మదురోకు పోటీగా ఆమె అభ్యర్థిత్వం ఖరారైంది. కానీ, కేసులు, ఇతరత్రా ఆరోపణలు చూపించి వెనెజువెలా సర్కారు ఆమెపై 15 ఏళ్లపాటు అనర్హత వేటు వేసింది. దీన్ని సుప్రీంకోర్టు సైతం సమర్థించడంతో.. అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం చేజారింది.

అనర్హత కారణంగా వైదొలిగినా ప్రజల పక్షాన పోరాడటం మాత్రం ఆమె ఆపలేదు. ప్రజాస్వామ్య హక్కుల కోసం డిమాండ్ చేస్తూ నియంతృత్వ పాలనపై ఆమె ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరిలో మరియాను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. తర్వాత ఆమెను విడిచిపెట్టి, సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు కథనాలు వెలువడ్డాయి. అయితే, నాటినుంచి ఆమె ప్రజా జీవితంలో కనిపించట్లేదు. కానీ, సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలను చైతన్యపర్చేందుకు పోరాటం చేస్తూనే ఉన్నారు. ప్రజల కోసం ఆమె చూపిన తెగువ ఎంతోమందిలో స్ఫూర్తి నింపిందని నోబెల్ అకాడమీ వెల్లడించింది.

# అవిరైన.. ట్రంప్ ఆశలు!



### ప్చ్.. 8 యుద్ధాలు ఆపినా దక్కని 'శాంతి'
### ట్రంప్‌ను పక్కన పెట్టడంపై కమిటీ ఏమన్నదంటే..

నోబెల్‌ను ముద్దాడి మురిసిపోదామనుకున్న డొనాల్డ్ ట్రంప్ ఆశలు ఆవిరయ్యాయి. అమెరికా అధ్యక్షుడిగా పదవి చేపట్టినప్పటి నుంచి ప్రచారం చేసుకుంటూ.. బెదిరింపులకు దిగుతూ చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. ఎనిమిది యుద్ధాలు ఆపానని సోషల్ మీడియాలో ఢంకా బజాయించుకొన్నా.. పలు దేశాలు ఆయనకు మద్దతిచ్చినా.. నోబెల్ కమిటీ మాత్రం పక్కనపెట్టింది. గత ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ట్రంప్ మాట్లాడుతూ.. "వారు నాకు నోబెల్ బహుమతి ఇవ్వరు. నేను అర్హుడినైనా నాకు ఎప్పటికీ ఇవ్వరు" అని వాపోయారు. ఆగస్టులో ఉక్రెయిన్, ఐరోపా నేతలతో మాట్లాడుతూ.. "యుద్ధాల్లో మగ్గుతున్న దేశాలమధ్య నేను ఒప్పందాలు చేశాను. అవి ఆరు ఒప్పందాలు. అక్కడ నేను కాల్పుల విరమణ మాత్రమే చేయించలేదు" అని చెప్పి, ఆ మరుసటి రోజే ఆరు కాదు ఏడు అని సవరించుకున్నారు. భారత్-పాక్ మధ్య యుద్ధం ఆపానని సెప్టెంబర్‌లో ఓ డిన్నర్ కార్యక్రమంలో చెప్పారు. "ఆ యుద్ధాన్ని ఎలా ఆపానో మీకు తెలుసు. నేను నోబెల్‌కు అర్హుడను. మొత్తం ఏడు యుద్ధాలు ఆపాను" అని ప్రచారాన్ని తీవ్రం చేశారు. నోబెల్ ప్రకటనకు ముందు స్పందిస్తూ.. ఆ అవార్డు నాకు రాకపోతే అమెరికాకు అవమానమనీ వ్యాఖ్యలు చేశారు. గాజాలో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఆయన ప్రకటించిన శాంతి ప్రణాళిక తొలిదశపై ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే. నోబెల్ ప్రకటించడానికి మూడు రోజుల ముందు నెతన్యాహు మెడలువంచి సంతకాలు చేయించారు. అంతకుముందు ఆయన ఆపానని చెప్తొన్న యుద్ధాలు.. అర్మేనియా అజర్బైజాన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో-రువాండా, ఇజ్రాయెల్-ఇరాన్, ఇండియా-పాకిస్థాన్, కంబోడియా-థాయ్లాండ్, ఈజిప్ట్-ఇథియోపియా, సెర్బియా- కొసావో కలిపి సంఖ్య ఎనిమిదికి చేరింది.

**నోబెల్ కమిటీ ఏమందంటే..?**

అమెరికాకంటే ఇతరదేశాల గురించి ఎక్కువగా ఆలోచించి, బెదిరించి యుద్ధాలు ఆపినా ట్రంప్‌నకు నోబెల్ దక్కలేదు. ఆయన పేరు మీద వచ్చిన నామినేషన్లు అన్నీ గడువు ముగిసిన తర్వాత వచ్చాయి. ఫిబ్రవరికే గడువు ముగిసింది. కొన్ని దేశాల నుంచి మద్దతు వచ్చినప్పటికీ నోబెల్ రాకపోవడంపై నార్వేజియన్ నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గెన్ వాట్నె ఫ్రిడ్నెస్ స్పందించారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా విజేతలను ఎంచుకుంటామని చెప్పారు. "ఈ కమిటీ మీడియా, బహిరంగ ప్రచారాలను గమనిస్తోంది. నోబెల్ గ్రహీతల చిత్రాలున్న గదిలో కూర్చుని ఆ లేఖలను మేం చూస్తాం. ఆ గది మాకు ధైర్యాన్నిస్తుంది. సమగ్రతతో పనిచేసే సంకల్పాన్ని కలిగిస్తుంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆశయాలకు అనుగుణంగా మేం నిర్ణయాలు తీసుకుంటాం" అని వెల్లడించారు. త్వరితగతిన దక్కిన దౌత్య విజయాలకంటే స్థిరమైన, బహుపాక్షిక ప్రయత్నాలకు కమిటీ ప్రాధాన్యం ఇస్తుంటుంది. ట్రంప్ ప్రయత్నాలు సుస్థిర ఫలితాలు ఇస్తాయని ఇంకా నిరూపితం కాలేదని హెన్నీ జాక్సన్ సొసైటీలో చరిత్రకారుడుగా ఉన్న థియో జెనొ అభిప్రాయం వ్యక్తంచేశారు. "ఒక ఘర్షణను స్వల్పకాలంపాటు ఆపడానికి.. దాని మూలకారణాలు గుర్తించి, పరిష్కరించడానికి మధ్య చాలా తేడా ఉంటుంది" అని వివరించారు. వాతావరణ మార్పులపై నమ్మకం లేనివారికి ఇలాంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కుతాయని అనుకోవడం లేదన్నారు. అయితే, ఇప్పుడు ట్రంప్‌నకు నోబెల్ మిస్ అయినా.. 2026లో ఆయన మరోసారి పోటీ పడే అవకాశం ఉంది. శాంతి బహుమతి కోసం ఆయన యుద్ధం ఇప్పుడే మొదలైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# భారత్‌తో అఫ్గాన్ దోస్తీ

**వ్యూహాత్మక సహకారాన్ని మరువలేం: ముత్తాఖీ**

**సీమాంతర ఉగ్రవాదంపై సంయుక్త పోరు: జైశంకర్**

అఫ్గాన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీతో భేటీవేళ పాకిస్థాన్‌కు భారత్ స్పష్టమైన సందేశాన్ని పంపించింది. సమీప పొరుగు దేశం అఫ్గాన్ అని.. అక్కడి ప్రజలకు భారత్ శ్రేయోభిలాషి అని పేర్కొంది. అఫ్గానిస్థాన్, భారత్ రెండూ సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాయని, వీటిపై సంయుక్త పోరు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ భారత విదేశాంగ శాఖ ఈ వ్యాఖ్యలు చేసింది. "పహల్గాం దాడి, కునార్-నంగర్హార్ భూకంపం.. ఈ రెండు సందర్భాల్లో ఇరు దేశాలు చర్చలు జరిపేందుకు అవకాశం లభించింది. ఈ క్రమంలో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడంలో ఈ ప్రత్యక్ష భేటీకి ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. సమీప పొరుగు దేశంగా, అఫ్గాన్ ప్రజల శ్రేయోభిలాషిగా.. అభివృద్ధి, పురోగతికి భారత్ ఎప్పుడూ ఆసక్తి చూపుతుంది. అఫ్గాన్‌లో భారత్ చేపట్టిన అనేక ప్రాజెక్టుల పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. కరోనా సమయంలో, ఇటీవల భూకంపం సంభవించినప్పుడు అండగా నిలిచాం. అభివృద్ధిపట్ల ఒకేరకమైన నిబద్ధత ఉన్నప్పటికీ.. రెండు దేశాలు



సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇది ఏ రూపంలో ఉన్న సమన్వయంతో రెండు దేశాలు ఎదుర్కోవాలి" అని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. పాకిస్థాన్ నుంచి ఎదురవుతున్న ముప్పును ఉద్దేశిస్తూ మాట్లాడిన ఆయన.. జమ్మూకశ్మీర్‌లో పాక్ ఆక్రమణపైనా స్పందించారు. అయితే, సమావేశం జరుగుతున్న సమయంలోనే కాబుల్లో పాకిస్థాన్ వాయుసేన దాడులు జరపడం గమనార్హం.

**అలా అనుమతించం..**

కీలక సమయాల్లో భారత్ అందిస్తోన్న సహకారాన్ని ముత్తాఖీ ప్రశంసించారు. భారత్‌పై ఉగ్రవాద దాడులు లేదా భారత వ్యతిరేక దాడులకు తమ భూభాగాన్ని ఎప్పటికీ అనుమతించబోమని స్పష్టం చేశారు. భారత్‌ను మిత్రదేశంగా భావిస్తామని.. పరస్పర గౌరవం, వాణిజ్యం, ప్రజా సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం

**- రిక్టర్ స్కేలుపై 7.6 తీవ్రత నమోదు**




దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని మిండనోవా ద్వీపంలో శుక్రవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 7.6గా నమోదైంది. దీంతో సునామీ హెచ్చరికలు జారీ చేశారు. పసిఫిక్ తీరంలో భారీగా అలలు ఎగసిపడతాయని స్థానిక వాతావరణ శాఖ హెచ్చరించింది. మనీలాకు ఆగ్నేయాన 62 కిలోమీటర్ల దూరంలోని సముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్టు గుర్తించారు. భూకంప తీవ్రతతో అనేక భవనాలు కొన్ని సెకన్లపాటు భారీగా కంపించాయి. దీంతో ప్రజలు భయంతో ఇళ్లనుంచి పరుగులు తీశారు. ఇందుకు సంబంధించిన భయానక దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ప్రాంతంలో మరిన్నిసార్లు ప్రకంపనలు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక, ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు. కొన్ని భవనాలు ధ్వంసమైనట్టు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు, ఫిలిప్పీన్స్ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. దాదాపు 3 మీటర్ల వరకు అలలు ఎగసిపడే అవకాశముందని అధికారులు తెలిపారు. ఇండోనేసియా, పలావ్ తీరాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల క్రితమే ఫిలిప్పీన్స్‌లో 6.9 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ విపత్తులో 72మంది ప్రాణాలు కోల్పోయారు.

# ద్విశతకం దిశగా జైశ్వాల్..

- వెండీస్‌తో రెండో టెస్ట్‌లో టీమిండియా జోరు
- తొలి ఇన్నింగ్స్‌లో 318/2
- క్రీజులో జైశ్వాల్ (173), గిల్ (20)




ఢిల్లీ వేదికగా వెస్టిండీస్‌తో శుక్రవారం మొదలైన రెండో టెస్టులో భారత్ అదరగొడుతోంది. టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకోగా ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బ్యాటర్లు దుమ్ములేపారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ సెంచరీ దాటి డబుల్ సెంచరీకి చేరువలో ఉండగా.. సాయి సుదర్శన్ సైతం చక్కటి ప్రదర్శన చేశాడు. దీంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండు వికెట్లు కోల్పోయి.. 318 పరుగులు చేసింది. మరోవైపు టీమిండియా బ్యాటర్లను కట్టడి చేయడంలో విండీస్ బౌలర్లు విఫలమయ్యారు. ప్రస్తుతం క్రీజులో జైశ్వాల్(173)తో పాటు కెప్టెన్ శుబ్‌మన్ గిల్(20) ఉన్నాడు.

ఇక తొలి టెస్టులో శతకం నమోదు చేసిన కేఎల్ రాహుల్ 38 పరుగుల వద్ద వారికన్ బౌలింగ్‌లో స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. రాహుల్ తనకు లభించిన ఆరంభాన్ని భారీ స్కోర్‌గా మలచడంలో విఫలమయ్యాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్ కూడా రాణించాడు. కొంత కాలంగా పేలవ ప్రదర్శనతో ఇబ్బందులు పడుతున్న సుదర్శన్ (87) ఈసారి పరుగుల బాట పట్టాడు. శతకానికి చేరువలో అతడు ఔటయ్యాడు. అయితే.. అతడికిది ఊరటనిచ్చే ఇన్నింగ్సే. జైశ్వాల్-సాయిసుదర్శన్ రెండో వికెట్‌కు 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 165 బంతుల్లో 12 ఫోర్ల సాయంతో 87 పరుగులు చేసిన సుదర్శన్.. తృటిలో తన తొలి టెస్టు సెంచరీ ఛాన్స్ కోల్పోయాడు. స్పిన్నర్ వారికన్ బౌలింగ్‌లో వికెట్ల ముందు సుదర్శన్ దొరికిపోయాడు. సుదర్శన్ ఔటయ్యాక గిల్‌తో కలిసి జైశ్వాల్ స్కోర్ బోర్డును ముందుకు నడిపించాడు.

**ఏడో శతకం**

టీమిండియాకు యువ ఓపెనర్ జైస్వాల్ అద్భుత ఆరంభాన్నిచ్చాడు. 145 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న అతడు.. ద్విశతకం (173 నాటౌట్) దిశగా సాగుతున్నాడు. టెస్టు కెరీర్‌లో అతడికిది ఏడో శతకం. టెస్టుల్లో తొలి రోజే ఇలా 150కి పైగా పరుగులు నమోదు చేయడం జైస్వాల్‌కు ఇది రెండోసారి. అతడి ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు ఉన్నాయి. గిల్ కూడా రాణిస్తే.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు భారీ స్కోరు ఖాయమే. ఇక విండీస్ బౌలర్లు వికెట్లు తీయడంలో తొలి టెస్టు మాదిరిగానే మరోసారి ఇబ్బందిపడ్డారు. రెండో టెస్టులో తొలి రోజు వచ్చిన రెండు వికెట్లు కూడా స్పిన్నర్ వారికన్ తీసినవే కావడం గమనార్హం.

ఈ టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఓ అరుదైన మైలురాయిని తాకాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అతను అంతర్జాతీయ క్రికెట్లో 3000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. 71 ఇన్నింగ్స్‌లో ఈ అరుదైన మైలురాయిని తాకిన జైస్వాల్ భారత్ తరఫున ఈ ఘనత సాధించిన రెండో ఫాస్టెస్ట్ బ్యాటర్గా రికార్డుల్లోకెక్కాడు. బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్(68 ఇన్నింగ్స్) జైస్వాల్ కంటే వేగంగా అంతర్జాతీయ క్రికెట్లో 3000 పరుగుల మైలురాయిని తాకాడు.

కాగా, రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం వెస్టిండీస్ జట్టు భారత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. ఆ మ్యాచ్లో టీమిండియా ఆటగాళ్లు రాహుల్, జురెల్, జడేజా సెంచరీలు చేశారు. సిరాజ్, జడేజా బంతితో రాణించారు.

# గర్ల్‌ఫ్రెండ్‌తో హార్దిక్..

- ముంబయి ఎయిర్‌పోర్ట్ వద్ద కెమెరాలకు చిక్కిన జంట




టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ప్రస్తుతం క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఆసియా టీ20 కప్-2025 సందర్భంగా గాయపడిన అతడు.. ఆస్ట్రేలియా పర్యటనకు కూడా దూరమయ్యాడు. ఈ క్రమంలో తనకు దొరికిన విరామ సమయాన్ని హార్దిక్ పాండ్యా తన ప్రియురాలితో గడుపుతున్నట్లు తెలుస్తోంది. కాగా హార్దిక్ గతంలో నటాషా స్టాంకోవిక్ అనే సెర్బియా మోడల్‌ను పెళ్లి చేసుకున్నాడు. ప్రేమలో పడి పెళ్లికి ముందే కుమారుడు అగస్త్యకు జన్మ ఇచ్చిన తరువాత కోవిడ్ సమయంలో అత్యంత సన్నిహితుల నడుమ దండలు మార్చుకున్నారు. కుమారుడు జన్మించిన మూడేళ్లకు అంటే.. 2023, ఫిబ్రవరి 14న ఉదయ్‌పూర్‌లో హార్దిక్- నటాషా మరోసారి ఘనంగా వివాహం చేసుకున్నారు. హిందూ- క్రిస్టియన్ సంప్రదాయాల ప్రకారం మరోసారి పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. అయితే, ఆ తర్వాత ఏడాదికే విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించి అభిమానులకు షాకిచ్చారు. విడాకుల తర్వాత హార్దిక్- నటాషా కుమారుడు అగస్త్య బాధ్యతను సమంగా పంచుకుంటున్నారు.

ఇదిలా ఉంటే.. నటాషాతో విడాకుల తర్వాత హార్దిక్.. సింగర్ జాస్మిన్ వాలియాతో ప్రేమలో పడినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఆమెతోనూ కటీఫ్ చెప్పిన హార్దిక్.. మోడల్ మహీకా శర్మతో డేటింగ్ చేస్తున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. ఇప్పటివరకూ వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు బయటకు రాలేదు. కానీ, తాజాగా ముంబయి ఎయిర్‌పోర్ట్ వద్ద హార్దిక్, మహికా కెమెరాలకు చిక్కారు. మహీకతో కలిసి ఒకే కారులో ముంబై ఎయిర్ పోర్టుకు వచ్చిన హార్దిక్.. ఆమె చేయిని పట్టుకుని ముందుకు నడిపించాడు. ఆ సమయంలో ఇద్దరూ నలుపు రంగు వస్త్రాల్లో.. ఒకే రకమైన జాకెట్ ధరించి.. వైట్ షూస్ వేసుకుని కనిపించారు.

కాగా 2016లో టీమిండియా తరఫున అరంగేట్రం చేసిన 31 ఏళ్ల హార్దిక్ పాండ్యా.. ఇప్పటి వరకు 11 టెస్టులు, 94 వన్డేలు, 120 టీ20 మ్యాచ్లు ఆడాడు. ఈ రైటార్మ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్.. టెస్టుల్లో 532, వన్డేల్లో 1904, టీ20లలో 1860 పరుగులు సాధించడంతో పాటు.. ఆయా ఫార్మాట్లలో 17, 91, 98 వికెట్లు తీశాడు.

ఐఎఫ్‌ఏ మోడల్ ఆఫ్ ది ఇయర్ గా నిలిచిన మహికా ఎకనామిక్స్ అండ్ ఫైనాన్స్ డిగ్రీ చేసింది. ప్రముఖ బ్రాండ్లకు మోడల్‌గా ర్యాంప్ షోల్లో పాల్గొంది.

# గిల్‌కు వన్డే కెప్టెన్సీ మంచి నిర్ణయమే..



రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించి శుభ్‌మన్ గిల్‌కు జట్టు పగ్గాలు అప్పగించడం మంచి నిర్ణయమని భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అభిప్రాయపడ్డారు. రోహిత్‌ను తప్పించారనడం సరికాదని.. ఇదంతా పరస్పర అంగీకారంతోనే జరిగి ఉంటుందని వ్యాఖ్యానించాడు. శుభ్‌మన్ గిల్‌కువన్డే కెప్టెన్సీ ఇవ్వడాన్ని గంగూలీ సమర్థించాడు. ఇది తప్పించడం కాదు. కెప్టెన్సీ మార్పిడం అంటాను. గతంలో నాకూ ఇలాంటి పరిస్థితి ఎదురైంది. రాహుల్ ద్రవిడ్ కూడా చూశాడు. క్రికెట్లో ప్రతి ఒక్కరికీ ఇది సహజమే. రాబోయే కాలంలో శుభ్‌మన్ గిల్‌కు 40 ఏళ్లు వచ్చినప్పుడూ ఇదే ఎదురవుతుంది. క్రీడాకారులు ఏదొకరోజు ముగింపు పలకాల్సిందే. ఇప్పుడు శుశుభ్‌మన్ గిల్ సారథిగా మరింత మెరుగయ్యేవరకూ జట్టులో రోహిత్ ఉండాలి. అప్పుడే యంగ్ కెప్టెన్ తర్ఫీదు పొందుతాడని గంగూలీ వ్యాఖ్యానించాడు. రోహిత్‌ను సంప్రదించే వన్డే కెప్టెన్సీపై నిర్ణయం తీసుకుని ఉంటారు. ఇది సరైందే అనిపిస్తోంది. రోహిత్ వన్డేల్లో ఆడొచ్చు. అదే సమయంలో ఒక యువ కెప్టెన్ ఎదిగేలా దిశా నిర్దేశం చేయొచ్చు. రోహిత్ అసాధారణ నాయకుడు. గత రెండేళ్లలో కెప్టెన్‌గా భారత్‌కు టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీలను అందించాడు. 2027 ప్రపంచకప్ సమయానికి అతడికి 40 ఏళ్లు ఉంటాయి. క్రీడల్లో అది పెద్ద వయసే. సెలక్టర్లు దీన్ని దృష్టిలో ఉంచుకునే నిర్ణయం తీసుకొని ఉండొచ్చునని గంగూలీ వ్యాఖ్యానించాడు.

# టెస్లా కారులో సెల్ఫ్‌డ్రైవ్‌లో రోహిత్

- భారత్‌లో ఇక ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదన్న మస్క్



ఇటీవల ముంబయిలో సియట్ క్రికెట్ అవార్డుల కార్యక్రమం జరిగింది. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అక్కడికి వచ్చాడు. అతడితోపాటు చాలా మంది క్రికెటర్లు హాజరైనప్పటికీ.. అందరి దృష్టి రోహిత్‌పైనే ఉంది. ఎందుకంటే ఈ కార్యక్రమానికి తన భార్య రితికాతో కలిసి అతడు 'టెస్లా' కారులో వచ్చాడు. స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చిన వీడియోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఆ ఫొటోను టెస్లాకనామిక్స్ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. దీనిని ఎలాన్ మస్క్ రీపోస్ట్ చేయడం గమనార్హం.

ఇందుకే కదా భారత్లో టెస్లా ప్రత్యేకంగా ప్రచారం చేయాల్సిన అవసరం లేదనిపించింది.. భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన రోహిత్ శర్మ తన కొత్త టెస్లా కారును డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడు.. అతడికి ఇన్‌స్టాగ్రామ్లో దాదాపు 45 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు.. అని టెస్లాకనామిక్స్ రాసుకొచ్చింది. దీనిని లైక్ చేసిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 'రీపోస్ట్' చేశారు. రోహిత్ కారు డ్రైవింగ్ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ కారు నంబర్ కూడా ప్రత్యేకమే. నంబర్ ప్లేట్‌పై 3015 ఉంది. రోహిత్ కుమార్తె సమైరా (డిసెంబర్ 30), అహాన్ (నవంబర్ 15) బర్త్ డేస్ వచ్చేలా ఈ నంబర్ని తీసుకున్నాడు.

# విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లి, రోహిత్




టీమిండియా స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డేల్లో కొనసాగితే దేశవాళీ క్రికెట్ ఆడక తప్పదు. వచ్చే ఏడాది జనవరిలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు వారు విజయ్ హజారే ట్రోఫీ (వన్డే)లో ఆడాల్సివుంటుంది. ఈ ట్రోఫీలో కనీసం మూడు లేదా నాలుగు మ్యాచ్‌లో వారు పాల్గొనే అవకాశముంది. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ముగిశాక.. కివీస్‌తో పోరుకు ముందు విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఢిల్లీ, ముంబయి జట్లు కనీసం ఆరు మ్యాచ్‌లు ఆడనున్నాయి. దీనిపై బీసీసీఐ వర్గాలు స్పందిస్తూ డిసెంబరు 6న విశాఖపట్నంలో దక్షిణాఫ్రికాతో చివరి వన్డేకు.. జనవరి 11న న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్‌కు మధ్య ఐదు వారాల సమయముంది. డిసెంబరు 24న విజయ్ హజారే టోర్నీ ప్రారంభమవుతుంది. ముంబయి ఆరు రౌండ్లు ఆడ నుండగా.. రోహిత్ కనీసం మూడు మ్యాచ్‌లకు అందుబా టులో ఉంటాడు. కోహ్లి కూడా అంతే అని తెలిపాయి.

# సీఎస్‌కే వదులుకునే ఆటగాళ్లు వీరే..



ఐపీఎల్ 2026కు సంబంధించిన ఓ ఇంట్రస్టింగ్ న్యూస్ వైరల్ అవుతోంది. ఈసారి చెన్నై సూపర్ కింగ్స్ పలువురు ఆటగాళ్లను వదులుకోనున్నట్లు తెలుస్తుంది. క్రిక్ బజ్ తెలిపిన వివరాల ప్రకారం.. దీపక్ హుడా, విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి, సామ్ కరన్, డెవాన్ కాన్వేలను సీఎస్‌కే వదులుకునే అవకాశం ఉంది. ఇప్పటికే స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రిటైర్ కావడంతో చెన్నై అకౌంట్ లో రూ.9.75 కోట్లు యాడ్ అయ్యాయి. అయితే ఈ ఆటగాళ్లను వదులుకునే విషయంపై సీఎస్కే నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ నుంచి ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్, శ్రీలంక స్పిన్నర్లు హసరంగ, మహీశ్ తీక్షణలు బయటకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో మిగత ఎస్ఆర్‌హెచ్, ఆర్సీబీ వంటి మిగిలిన జట్లలో ఎలాంటి మార్పులు ఉంటాయో అని క్రికెట్ ఫ్యాన్స్ లో ఆసక్తి నెలకొంది.

ఇక ఐపీఎల్ 2026 విషయానికి వస్తే.. ఈ సారి వేలం ముంబైలో జరగనున్నట్లు సమాచారం. డిసెంబర్ 13 నుంచి 15 వరకు ఐపీఎల్ 2026 వేలం జరగనున్నట్లు తెలుస్తుంది. బీసీసీఐతో చర్చించిన ఫ్రాంచైజీల ప్రతినిధులు ఈ తేదీలను సూచించారని తెలుస్తుంది.

ఈ విషయంపై ఐపీఎల్ కమిటీదే తుది నిర్ణయంగా ఉంటుంది. ఇదే సమయంలో ఫ్రాంఛైజీలు తమ వద్ద ఉంచుకునే రిటెన్షన్ లిస్టును, వదులుకునే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐకి సమర్పించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే సీఎస్కే, రాజస్థాన్ పైన పేర్కొన్న ఆటగాళ్లను రిలీజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలానే గత సీజన్ వేలంలో ఎవరూ ఊహించని రీతిలో రూ. 23.75 కోట్ల ధర దక్కించుకున్న వెంకటేశ్ అయ్యర్‌ను కేకేఆర్ వదిలించుకోవచ్చని టాక్ వినిపిస్తోంది.

# మరోసారి ఎవర్‌గ్రీన్ బ్యూటీ..?

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున ఇటీవల తన కెరీర్‌లోని మైల్‌స్టోన్ 100వ చిత్రాన్ని సైలెంట్‌గా స్టార్ట్ చేశాడు. తమిళ దర్శకుడు ఆర్ కార్తీక్ డైరెక్షన్‌లో సినిమా రూపొందుతోంది. ఈ సినిమాతో నాగార్జున ఎలాంటి కంటెంట్ పట్టుకొస్తాడా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, సినిమాకు 'లాటరీ కింగ్' అనే టైటిల్‌ను పెట్టేందుకు మేకర్స్ ఆలోచిస్తున్నారట. నాగార్జున కెరీర్‌లో ప్రెస్టీజియస్ చిత్రంగా రాబోతున్న ఈ మూవీలో క్యాస్టింగ్ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా సినిమాలో సీనియర్ హీరోయిన్ టబూ నటించబోతున్నట్టు సినీ సర్కిల్స్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో 'నిన్నే పెళ్లాడతా' వంటి రొమాంటిక్ బ్లాక్‌బస్టర్ చిత్రంలో నటించిన ఈ జంట ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. ఇక ఆ తర్వాత 'ఆవిడా మా ఆవిడే' సినిమాలో నటించారు. ఆ తర్వాత ఈ జోడీ మళ్లీ కలిసి నటించలేదు. దీంతో ఇప్పుడు నాగ్ కెరీర్‌లో మైల్‌స్టోన్ 100వ చిత్రంలో టబూ నటిస్తుందనే వార్తతో అక్కినేని అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. మరి నిజంగానే ఈ సినిమాలో టబూ నటిస్తుందా? అనేది అఫీషియల్‌గా తెలియాల్సి ఉంది.



# కిష్కింధపురి: ఓటీటీకి రెడీ



బెల్లకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందింది. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జీ5 వేదికగా అక్టోబర్ 17నుంచి స్ట్రీమింగ్ కానుంది. దీని ఓటీటీపై కొన్ని రోజులుగా ఎన్నో తేదీలు సోషల్ మీడియాలో షేర్ అయ్యాయి. ఇప్పుడు జీ5 తేదీని అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 17 సాయంత్రం 6నుంచి సినిమా ఓటీటీలోకి అందుబాటులోకి రానున్నట్టు వెల్లడించింది. అలాగే అక్టోబర్ 19 సాయంత్రం జీ టీవీలో దీన్ని ప్రదర్శించనున్నట్టు తెలిపింది.

కథేంటంటే: రాఘవ్ (బెల్లంకొండ సాయిశ్రీనివాస్), మైథిలి (అనుపమ) ప్రేమికులు. ఇద్దరూ మరొక స్నేహితుడు (సుదర్శన్)తో కలిసి ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌసెస్ టూర్స్‌ను నిర్వహిస్తుంటారు. థ్రిల్ కోరుకునేవాళ్లందరినీ కలిపి ఓ పాడుబడిన బంగ్లాల్లోకి తీసుకెళ్లి అక్కడ దెయ్యాలున్నాయని నమ్మిస్తూ థ్రిల్ పంచడమే టూర్ ఉద్దేశం. అలా ఓసారి 11మందితో కలిసి కిష్కింధపురి ఊరి పరిసరాల్లో ఉన్న సువర్ణమాయ రేడియో స్టేషన్‌కు వెళతారు. 1989లోనే పాడుబడిన స్టేషన్ అది. సువర్ణమాయలోకి అడుగుపెట్టిన 11మందిలో ఎవరినీ వదిలిపెట్టనని వార్నింగ్ ఇస్తుంది వేదవతి. తర్వాత అందులోని ఓ చిన్నారి టార్గెట్ అవుతుంది. రాఘవ్ తన ప్రాణాల్ని అడ్డుపెట్టి దెయ్యానికి ఎదురెళతాడు. మరి ఆ చిన్నారిని రక్షించాడా? మిగిలినవాళ్ల పరిస్థితి ఏమిటి? అసలు వేదవతి ఎవరు? ఎందుకు దెయ్యమైంది? సువర్ణమాయ స్టేషన్‌తో ఆమెకున్న సంబంధమేంటి? అందులోకి వెళ్లిన వాళ్లని ఎందుకు చంపేస్తోంది? అన్నది చిత్ర కథ.

# సూపర్ వసూళ్లవైపు.. కాంతార-1



రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1'. భారీ అంచనాల మధ్య దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన సినిమా మరో ఘనతను సొంతం చేసుకుంది. విడుదలైన 9 రోజుల్లోనే రూ.500 కోట్ల క్లబ్‌లో స్థానం సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా సాధించిన వసూళ్లను తెలుపుతూ నిర్మాణసంస్థ తాజాగా పోస్టర్ విడుదల చేసింది. వరల్డ్ వైడ్‌గా రూ.509 కోట్లు సాధించినట్టు తెలిపింది. ఇప్పటికే పలు సినిమాల రికార్డులు తిరగరాసిన 'కాంతార 1'.. ఇప్పుడు 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన రెండో సినిమాగా నిలిచింది. త్వరలోనే మొదటి స్థానంలోకి వెళ్లే అవకాశముందని అభిమానులు భావిస్తున్నారు.

ఈ ఏడాదిలో విడుదలైన 'ఛావా' రూ.600 కోట్లతో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల వరుసలో టాప్‌లో ఉంది. 'కాంతార 1' థియేటర్లలో హౌస్ఫుల్ బోర్డులతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. దీంతో రికార్డును మరికొన్ని రోజుల్లోనే బీట్ చేసి టాప్‌వన్‌లో నిలిచే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సినిమా విజయం సాధించడంతో రిషబ్ వరుస ఇంటర్వ్యూలతో దీన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. "ఇండస్ట్రీలో ఎంతోమంది టాలెంటెడ్ దర్శకులున్నారు. వారందరితో పోలిస్తే నేను పిల్లాడిని. కానీ, వాళ్లందరూ కాంతారపై ప్రశంసలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది. ఈ విజయం నా బాధ్యతను రెట్టింపు చేసింది" అని అన్నారు.

## ఒక్కో ఎపిసోడ్..
# రెండు గంటలా?

గత కొన్నేళ్ళలలోనే ఓటిటి హవా సినిమాను మించిపోయింది. ప్రపంచ కంటెంట్ మొత్తం ప్రతీ ఒక్కరికీ చేరువవుతోంది. మరి అలా వరల్డ్ వైడ్ మంచి పాపులార్టీ ఉన్న సాలిడ్ వెబ్ సిరీస్‌లలో హాలీవుడ్ సిరీస్ సూపర్ నాచరల్ థ్రిల్లర్ 'స్ట్రేంజర్ థింగ్స్' ఒకటి. నాలుగు బ్లాక్ బస్టర్ సీజన్స్ తర్వాత సీజన్ 5పై మంచి హైప్ ఉంది. దీంతో ఈ సీజన్ కోసం ఎగ్జైటెడ్‌గా చూస్తున్న ఫ్యాన్స్‌కి ఒక షాకింగ్ రన్‌టైం ప్రతీ ఎపిసోడ్‌కి లాక్ అయినట్టుగా వినిపిస్తుంది. ఇదివరకే ఈ సీజన్‌ని రెండు పార్టులుగా విడదీసి పూర్తి చేసేస్తారని కొందరు డిజప్పాయింట్ అయ్యారు. కానీ ఇపుడు ఒకో ఎపిసోడ్ తాలూకా రన్ టైం వింటే మతిపోవాల్సిందే. ఎందుకంటే ఒకో ఎపిసోడ్ ఏకంగా 2 గంటలమేర ఉంటుందని రూమర్స్ వస్తున్నాయి. ఇలా ఒక వెబ్ సిరీస్‌లో ఒకో ఎపిసోడ్ ఇంత రన్ ఉండటమనేది చాలా అరుదు. అలాగే ఒకో ఎపిసోడ్‌కి మేకర్స్ ఏకంగా 50నుంచి 60 మిలియన్ డాలర్స్‌కి పైగా ఖర్చు చేశారనే టాక్ ఉంది. ఇక ఈ సీజన్ తాలూకా మొదటి వాల్యూమ్ నవంబర్ 27న నెట్‌ఫ్లిక్స్‌లో రానుంది. సో చూడాలి, నిజంగానే ఈ షాకింగ్ రన్ టైంలోనే వస్తాయా? లేక తక్కువలోనే ఉంటాయా? అనేది.



# సుక్కూ మొదలెట్టేది అప్పుడే..

రామ్‌చరణ్ ప్రస్తుతం 'పెద్ది' షూటింగ్‌లో బిజీ. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రానున్న సినిమా ప్రస్తుతం పూణేలో షూటింగ్ జరుపుకుంటోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తోన్న ప్రాజెక్టు బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా? అని ఆసక్తిగా చూస్తున్నారు. ఇక సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అయితే, ఈ సినిమా తర్వాత చరణ్ తన నెక్స్ట్ చిత్రాన్ని సుకుమార్ డైరెక్షన్‌లో చేయబోతున్నట్టు తెలుస్తోంది. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై ఎలాంటి కథనాన్నైనా అభిమానులు ఆసక్తిగా ఫాలో అవుతున్నారు. అయితే, ఫిల్మ్ సర్కిల్స్ రిపోర్ట్స్ ప్రకారం ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరి 2026లో ప్రారంభం కానుందని సమాచారం. పెద్ది షూటింగ్ జనవరి 2026 వరకు కొనసాగనుండటంతో.. తర్వాత చరణ్ సుకుమార్ కొత్త చిత్రంపై కేర్ తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్, సుకుమార్ కాంబోలో వచ్చిన 'రంగస్థలం' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్‌లో సినిమా రానుండటంతో ఈ మూవీ ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



# హీరోల షిఫ్ట్‌లూ 8 గంటలే!

ఇటీవలి కాలంలో ఇండియన్ సినిమా దగ్గర సెన్సేషన్‌గా వైరలైన హీరోయిన్ ఎవరంటే.. అది దీపికా పదుకొనె. పలు సినిమాల నుంచి ఆమెని తొలగించడం, ఆమె పెడుతున్న కండిషన్స్ వంటివి వైరల్‌గా మారాయి. అయితే అవి అప్పటికి టాక్ మాత్రమే. అసలు దీనిపై దీపిక ఒపెనై.. మళ్లీ చేసిన షాకింగ్ కామెంట్స్ ఇప్పుడు మళ్లీ వైరల్‌గా మారాయి. ఆమె 'కేవలం 8 గంటలు మాత్రమే షూటింగ్‌లో పాల్గొంటానని చెప్పింది నిజమే'నని తెలిపింది. ఇండియన్ సినిమా దగ్గర ఎంతోమంది సూపర్ స్టార్ హీరోలు కూడా కేవలం 8 గంటలు మాత్రమే వర్క్ చేస్తారు. వీకెండ్స్ షూటింగ్‌లో పాల్గొనరు. ఈ విషయం ఎందుకు హెడ్ లైన్స్ ఎక్కలేదు అనేది మాత్రం అర్థం కాదని ఆమె వ్యాఖ్యానించింది. అంతేకాకుండా ఇండియన్ సినిమాపై కూడా పలు సంచలన కామెంట్స్ చేసింది దీపిక. మన ఇండస్ట్రీకి ఒక సిస్టం లేదని, ఒక విధానాన్ని అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నది ఆమె చేసిన వ్యాఖ్య. ఆమెనుంచి ఈ షాకింగ్ కామెంట్స్ రావడం ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతోంది.

